ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 15 ఏప్రిల్ 2024



కోడ్‌తో కుదరదన్నా.. విగ్రహావిష్కరణ



బంగారుపాళ్యం, ఏప్రిల్ 14: ఎన్నికల కోడ్ ఉన్నందున బంగారుపాళ్యం మండలం మహాసముద్రంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కుదరదని ఆదివారం అధికారులు అడ్డుకున్నారు. దళిత నేత కట్టమంచి పునీత్ ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి కృష్ణయ్య ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. అధికారులు వచ్చి విగ్రహానికి ముసుగువేశారు. గ్రామస్తులు, యువకులు అక్కడికి చేరుకోగా ఘర్షణ వాతావరణం నెలకొంది. దళితపెద్దలు ప్రొఫెసర్ జనార్దన్, రిటైర్డ్ జడ్జి గుర్రప్ప, దుగ్గాని జయరామ్, విజయ్‌కుమార్, సోమరాజు, నాగరాజు తదితరులు గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో కలసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తాము ఏ పార్టీకి చెందిన వాళ్లం కాదని, తమకు పండుగ అయిన అంబేద్కర్ జయంతిని అడ్డుకోవడం దారుణమన్నారు. అలాగే, ముంగరమడుగు దళితవాడ వద్ద సుమారు ఐదు ఎకరాల్లో అంబేద్కర్ స్మృతి వనానికి ప్రొఫెసర్ జనార్ధన్, రాజశేఖర్, ఆనగల్లు మునిరత్నం, పీటర్, నాగేంద్ర బాబు భూమిపూజ చేశారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ షన్మోహన్, పక్కనే ఎస్పీ



అందరికీ ఆదర్శం.. అంబేడ్కర్

చిత్తూరు, ఏప్రిల్ 14: జిల్లాలో ఆదివారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిత్తూరులో అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ షన్మోహన్ నివాళులర్పించి మాట్లాడారు.దళిత, గిరిజనులకే కాకుండా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎంతో కృషి చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన ఆశయాలను నెరవేరుస్తూ వచ్చే నెల 13న ప్రతి ఒక్కరు ఓటు వేయాలని సూచించారు. ఎస్పీ మణికంఠ చందోలు, డీఆర్వో పుల్లయ్య, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి రాజ్యలక్ష్మీ, డీవీఎంసీ మెంబర్లు బాబు, రాజ్‌కుమార్, డేవిడ్, దేవరాజులు, చెంగయ్య, రవి, మురగయ్య, ధనంజయరావు, దామోదరం, దళిత, గిరిజన సంఘాల నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

స్వల్పంగా తగ్గిన ఎండ



కలెక్టర్ బంగ్లా వద్ద బోసిపోయిన పుత్తూరు రోడ్డు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14: ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి అయితే, వడగాడ్పులు తోడవ్వడంతో రహదారిపై కొద్దిదూరం ప్రయాణించాక ప్రజలు నీడ పట్టున చేరుతున్నారు. మండలాల వారీగా ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలివీ.. నింద్రలో 39.8, తవణంపల్లెలో 39.7, పులిచెర్లలో 39.6, గుడుపల్లెలో 39.0, శ్రీరంగరాజపురంలో 38.9, గుడిపాల, పుంగనూరులో 38.5, నగరి, సోమల, విజయపురంలో 37.9, సదుంలో 37.7, పాలసముద్రంలో 37.5, కార్వేటినగరంలో 37.4, పెద్దపంజాణి, చిత్తూరులో 37.2, చౌడేపల్లె, రొంపిచెర్ల, యాదమరిలో 37.1, కుప్పంలో 37.0, గంగాధరనెల్లూరులో 36.7, శాంతిపురంలో 36.5, వెదురుకుప్పంలో 36.4, బంగారుపాళ్యంలో 36.4, వి.కోట, పెనుమూరు, పలమనేరులో 35.4, పూతలపట్టులో 35.1, గంగవరంలో 35.0, బైరెడ్డిపల్లిలో 34.9, ఐరాలలో 34.7, రామకుప్పంలో 34.3 డిగ్రీలు.

ఓటు నమోదుకు నేడే చివరి అవకాశం



10,500 దరఖాస్తుల రాక.. ఏడు వేలు పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావడానికి ఎన్నికల కమిషన్ ఇచ్చిన చివరి అవకాశం సోమవారంతో ముగియనుంది. ఇప్పటికీ ఓటు లేనివారు ఆన్‌లైన్ లేదా ఆయా మండలకేంద్రాల్లో ఎన్నికల అధికారులకు ఫారం-6 అందజేయాలి. వీటిని పరిశీలించి 24వ తేదీలోగా కొత్త ఓటరుగా నమోదు చేస్తారు. ఓటు కోసం ఇప్పటివరకు 10,500 దరఖాస్తులు అందగా, వాటిలో ఏడు వేలను అధికారులు పరిశీలించి ఆమోదం తెలిపారు. మరో 3500 దరఖాస్తుల పరిశీలన ఈనెల 24వ తేదీలోగా పూర్తిచేస్తారు. జిల్లాలో ప్రస్తుతం 15,54,712 మంది ఓటర్లు ఉన్నారు. రోజురోజుకూ ఈ సంఖ్య పెరుగుతూవస్తోంది. అయితే అవగాహన లేకపోవడం వలన ఇప్పటికీ కొంతమంది ఓటు ఉందో లేదో పరిశీలించుకోలేకపోతున్నారు. అలాంటి వారికోసమే ఎన్నికల సంఘం ఏప్రిల్ 15 వరకు అదనంగా అవకాశం కల్పించింది. తమకు ఓటు ఉందో లేదో సోమవారం రోజైనా తెలుసుకుని.. సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకుంటే.. మే 13వ తేదీన ఓటు వేయొచ్చు.

ఫారం-6 మాత్రమే ఇవ్వాలి

ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం మాత్రమే గడువు ఉంది. ఓటు కోసం బూత్‌స్థాయి అధికారులు.. లేదా నియోజకవర్గాల్లోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు లేదా ఆయా మండలాల తహసీల్దార్లు, డీటీలను సంప్రదించి ఫారం-6 దరఖాస్తు సమర్పించాలి. దీనికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా 1950 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోను చేయాలి. ఓటరు నమోదుకు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్ణీత ప్రొఫార్మాలో ఆధార పత్రాలతో జతపరచి దరఖాస్తు చేసుకోవాలి. ముఖ్యంగా జిరాక్స్ పత్రాలను జతచేయాలి. ఇటీవల తీసుకున్న పాస్‌పోర్టుసైజ్ ఫొటోను ప్రొఫార్మాలో అడిగిన ఇతర వివరాలను సమర్పిస్తే దరఖాస్తు తిరస్కరణకు గురికాకుండా ఓటరుగా నమోదవుతారు. ప్రస్తుతం ఫారం 6 మాత్రమే సమర్పించి ఓటరుగా నమోదు కావచ్చు. ఫారం-7, ఫారం-8 ద్వారా తొలగింపులు, మార్పులు, చేర్పులకు ఇప్పుడు అవకాశం లేదు.

యువ ఓటర్లు 33వేల మంది

ఇప్పటికే జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు కొత్తగా ఓటు హక్కును కల్పించారు. వీరు 33,495 మంది ఉన్నారు. మొదటిసారి ఈ ఏడాది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

25న అనుబంధ జాబితా

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుదిజాబితాను ఫిబ్రవరి 8న ఎన్నికల అధికారులు ప్రకటించారు. మరోసారి జాబితా సవరణ చేపట్టడంతో ఈనెల 15వ తేదీవరకు ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. వీటి పరిశీలన పూర్తయిన తర్వాత 25వ తేదీన అనుబంధ జాబితా ప్రకటిస్తారు.

సింపతీ కోసమే డ్రామా

ఐప్యాక్ ప్లాన్‌లో భాగంగానే జగన్‌పై గులకరాళ్ల దాడి అంటూ టీడీపీ విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: సింపతీ కోసమే సీఎం జగన్‌పై గుళకరాళ్ల దాడి డ్రామా ఆడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం వీరు మాట్లాడారు. సీఎం జగన్‌కే భద్రత లేదంటే పూర్తిగా పోలీసులు, నిఘా వైఫల్యమేనని చిత్తూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ ఆరోపించారు. దీనికి బాధ్యులైన అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు. రాళ్లదాడిపై ప్రజలకు అనేక అనుమానాలున్నాయన్నారు. ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లోనే టీడీపీ అధినేత చంద్రబాబును దూషిస్తూ ప్లకార్డులతో వైసీపీ నేతలు రోడ్లపైకి ఎలా వచ్చారని ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ప్రశ్నించారు. దీనిపై వారి వద్దఉన్న ఆధారాలేంటని అడిగారు. మరో నాలుగురోజుల్లో ఎన్నికల మూడ్ మార్చే సంచలన సంఘటనలు జరగొచ్చని ఈనెల 10న వైసీపీ నేత అవుతు శ్రీధర్ రెడ్డి ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారని సురేంద్రకుమార్ గుర్తుచేశారు. ఆయన చెప్పినట్లే జరిగిందన్నారు. ఐప్యాక్ టీం ప్లాన్‌లో భాగమేఈ రాళ్లదాడి అని సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. గత ఎన్నికల తరహాలోనే ఇప్పుడు గులకరాళ్ల డ్రామాకు తెరలేపారని కోదండ యాదవ్ విమర్శించారు. నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా వైఫల్యమే కారణం: వంగవీటి

2019 ఎన్నికలకు సరిగ్గా నెల ముందు వైఎస్ జగన్ కోడికత్తి దాడి చేయించుకుని, సింపతీతో ఓట్లు వేయించుని గెలిచారని రాష్ట్ర కాపుసంఘం నేత వంగవీటి రాధా అన్నారు. ఇప్పుడూ ఎన్నికల ముందు సింపతీ కోసం గులకరాయి దాడి డ్రామా ఆడుతున్నారన్నారు. ప్రజలు తెలివైన వాళ్లని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడిస్తారన్నారు. సీఎం జగన్‌పై జరిగిన దాడికి కారణం పోలీసుల భద్రతా వైఫల్యమేనని ఎన్నికల కమిషన్ స్పందించి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికలప్పుడే ఇలాంటివి తెరపైకి..

పలమనేరు: ఎన్నికలు వచ్చినప్పుడే ఇటువంటివి తెరమీదకు వస్తున్నాయని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆదివారం పేర్కొన్నారు. వివేకానందరెడ్డిని చంపిన వారిని జగన్ వెనకేసుకొస్తున్నారని సొంత చెల్లెళ్లు అంటున్నారన్నారు. ఈయనేమో తనపై చంద్రబాబు, తెలుగుదేశం నాయకులు దాడి చేస్తున్నారని ఆరోపించడం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ దాడులను ప్రోత్సహించదని, సీఎం జగన్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నానని చెప్పారు. ఈ దాడి చంద్రబాబు చేయించారని ప్రచారం చేయడం సిగ్గుపడాల్సిన అంశమన్నారు.

వసూల్ రాజా.... జబర్దస్త్ దోపిడీ

శ్రీకాళహస్తి,నగరి ఎమ్మెల్యేలపై షర్మిల ఫైర్



సత్యవేడు సభలో మాట్లాడుతున్న షర్మిల



పుత్తూరు సభలో షర్మిల

శ్రీకాళహస్తి/సత్యవేడు/పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 14 : శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, నగరి ఎమ్మెల్యే రోజాలపై పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఫైర్ అయ్యారు. ఆదివారం జిల్లా పర్యటనలో భాగంగా ఆమె శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు పట్టణాల్లో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేలపై తీవ్రస్థాయి ఆరోపణలతో విరుచుకుపడ్డారు. శ్రీకాళహస్తి సభలో మాట్లాడుతూ... ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి మీకు ఎప్పుడైనా పనికొచ్చాడా? ఏనాడైనా పనులు చేసిపెడుతున్నాడా? అని ప్రశ్నించారు.మీ ఎమ్మెల్యే ఎలా ఉన్నాడని స్థానికులను అడిగితే వసూల్ రాజా అని చెప్పారన్నారు.మొత్తం చెరువులన్నీ దోచేసుకున్నాడట...ఇసుక, మట్టి మాఫియాగా తయారై చెరువులు కూడా ఖాళీ చేసేసాడంట కదా అని వ్యాఖ్యానించారు. కబ్జాల రాజా అంట... ఆఖరికి పేదలకు ఇచ్చిన భూములను కూడా వదల్లేదట మీ ఎమ్మెల్యే అంటూ ఎద్దేవా చేశారు. ఈయన దెబ్బకు పరిశ్రమలు మూసుకుని వెళ్లిపోతున్నారట కదా అని ప్రశ్నించారు.

ఆదివారం రాత్రి పుత్తూరు కేఎస్ రోడ్డులోని కాపువీధి సర్కిల్ వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ నగరి నియోజకవర్గానికి నలుగురు మంత్రులని జనం చెబుతున్నారన్నారు. రోజా భర్త, ఆమె ఇద్దరు అన్నలు కూడా మంత్రులేనన్నారు. నియోజకవర్గంలో యధేచ్ఛగా ఇసుక, మట్టి మాఫియా నడిపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. నగరి నియోజకవర్గానికి రోజా ఎన్నో హామీలిచ్చారని ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఒక్క రోజు కూడా నియోజకవర్గం కోసం పనిచేయలేదన్నారు. మళ్ళీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమేనని, డబ్బులు కూడా ఇస్తారంట అని వ్యాఖ్యానించారు. ఎంత డబ్బు ఇచ్చినా తీసుకోవాలని, అవన్నీ ఇసుక, మట్టి మాఫియా నుంచీ దోచుకున్న డబ్బులేనన్నారు. కానీ ఓటు వేసే ముందు ఆలోచించాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇస్తే 30 ఏళ్ల సేవ చేస్తానని వాగ్దానం చేశారు.సీపీఐ,సీపీఎం నాయకులు రామానాయుడు,గంగరాజు,డీసీసీ అధ్యక్షుడు భాస్కర్, జగపతి తదితరులు ప్రసంగించారు. సత్యవేడు సభలో షర్మిల మాట్లాడుతూ ఈ నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారట అంటూ వ్యాఖ్యానించారు. అసలు ఎమ్మెల్యే ఉన్నాడా లేడా... కోనేటి ఆదిమూలం కొడుకు షాడో ఎమ్మెల్యే అంట కదా అని ప్రశ్నించారు.

వైసీపీ ఇంతే! | కుప్పంలో కోడ్ ఉల్లంఘన

కుప్పం, ఏప్రిల్ 14: కుప్పంలో వైసీపీ నేతలు యధేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. జగన్‌రెడ్డిపై గులకరాయి దాడికి నిరసనగా ధర్నా చేశారు. అంతకుముందు ర్యాలీగా వచ్చారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ధర్నా చేయడంపై టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఫోన్ ద్వారా ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. వీడియోలు, ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించారు. రిటర్నింగ్ అధికారిని వివరణ కోరగా.. కోడ్ అమల్లో ఉన్నప్పుడు ధర్నాలు, నిరసనలు చేసేందుకు అనుమతి లేదన్నారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసీపీ ధర్నా చేయడం కోడ్ ఉల్లంఘించడమేన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి, వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.



'బల్ల'లో సర్పంచి సహా 32మందిపై కేసులు

రామకుప్పం: రామకుప్పం మండలం బల్ల గ్రామంలో ఎన్నికల నియామవళిని ఉల్లఘించి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసిన సర్పంచు విజయ్‌థామస్, అతని తండ్రి, రెస్కో డైరెక్టరు థామస్, అనుచరుడు రవికుమార్‌తో పాటు 32 మందిపై ఆదివారం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ ఆందోళన వీడియోలను గ్రామస్థులు కలెక్టరుకు పంపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ నోడల్ అధికారి ఈశ్వరన్నను కలెక్టరు ఆదేశించారు. ఈశ్వరన్న తన బృందంతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.ఆయన ఫిర్యాదు మమేరకు 32మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

దేవదాయశాఖ ఏసీకి నోటీసు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 14: జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనరు ప్రసన్నలక్ష్మికి జాయింట్ కలెక్టరు శ్రీనివాసులు ఆదివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. కోడ్‌ను అతిక్రమించి కట్టమంచి వరదరాజస్వామి ఆలయంలో ఈ నెల 12వ తేది అధికార పార్టీ ఎన్నికల సమావేశం నిర్వహించినందుకుగాను ఈ నోటీసు ఇచ్చారు. ఆ సమావేశంలో పాల్గొన్న పార్టీ ప్రతినిధులు, అనుమతించిన అధికారుల వివరాలతో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై ఏసీని సంప్రదించగా, కర్నూలు ఎన్నికల శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఉన్నానని, సోమవారం తెలియజేస్తానని చెప్పారు.

ముగిసిన ఈవీఎంల ర్యాండమైజేషన్

● నియోజకవర్గాలవారీగా కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14: ఈవీఎంల తనిఖీలు ఆదివారంతో ముగిశాయి. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో కలెక్టర్ షన్మోహన్ నేతృత్వంలో మూడ్రోజుల పాటు ఈ ర్యాండమైజేషన్ కొనసాగింది. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి 2120 చొప్పున బ్యాలెట్.. కంట్రోల్ యూనిట్లు, 2297 వీవీప్యాట్ల తనిఖీలు జరిగాయి. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇదే సంఖ్యలో తనిఖీలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల లాగిన్ ద్వారా నెంబర్ స్కానింగ్ పూర్తిచేశారు. ఆయా నియోజకవర్గ ఆర్వోలకు వీటిని అందించారు. పోలింగ్ ప్రారంభమయ్యేంతవరకు వీటిని ఇక్కడి గోదాముల్లోనే నిల్వ ఉంచుతారు.



పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు



కుప్పం రైల్వే స్టేషన్‌లో రైళ్ల కోసం నిరీక్షిస్తున్నప్రయాణికులు

వాణియంబాడి సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్

● కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే రైళ్లు ఆలస్యం

కుప్పం, ఏప్రిల్ 14: తమిళనాడు రాష్ట్రం వాణియంబాడి సమీపంలో గూడ్స్ రైలు ఆదివారం రాత్రి పట్టాలు తప్పింది. దీంత కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే పలు రైళ్లు ఆలస్యమయ్యాయి. తిరుపతి నుంచి కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ వాణియంబాడిలో ఆగిపోయింది. అలాగే చెన్నై నుంచి కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్ రైలును వలతూర్ రైల్వే స్టేషన్‌లో అధికారులు ఆపేశారు. దీంతో కుప్పం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు రాత్రి వేళ తీవ్ర అవస్థలు పడ్డారు. రైళ్లకోసం ఎదురుతెన్నులు చూస్తూ స్టేషన్‌లోనే కాలం గడిపారు. కాగా రైల్వే అధికారులు వాణియంబాడి వద్ద పట్టాలు తప్పిన రైలుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

దిక్సూచి DIKSUCHI

భారతదేశ చరిత్రలో గుప్తుల కాలాన్ని పరిశీలించే క్రమంలో ఆనాటి సామాజిక, ఆర్థిక తదితర పరిణామాలను తరచి చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు వీటిని మరింత లోతుగా తెలుసుకోవాలి.

గుప్తుల కాలంలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు



ఇండియన్ హిస్టరీ

గుప్తుల కాలం నాటి సమాజంలో నాలుగు వర్ణాలతో పాటు 'చండాలులు' అనే పంచమ వర్ణం ఏర్పడింది. దీనిని ఫాహియాన్ 'అంటరాని వర్ణం'గా పేర్కొన్నాడు. వర్ణాశ్రమ ధర్మాలు ఉండేవి. అయినప్పటికీ 'వర్ణ సంకర' విధానం కొనసాగింది. వర్ణాశ్రమ ధర్మం కాపాడటానికి 'అభయదత్తుడు' అనే ఉద్యోగిని రాజు నియమించాడు. శాతవాహనుల మాదిరిగానే వీరు కూడా బ్రాహ్మణులకు అగ్రహారాలు(గ్రామాలు) దానంగా ఇచ్చేవారు.

గుప్తుల కాలంలో స్త్రీ స్వేచ్ఛ తగ్గిపోయింది. సతీసహగమనం, బాల్య వివాహాలు, బహుభార్యత్వం వంటి అనాచారాలు కొనసాగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహాలు ఉండేవి. పురుషులు అధిక వర్ణం స్త్రీలను వివాహాలు చేసుకోవడాన్ని ధర్మశాస్త్రాలు నిషేధించాయి. క్రీ.శ.510లో 'ఎరాన్' శాసనాన్ని భానుగుప్తుడు చెక్కించాడు. దీనిలో సతీసహగమనం, దేవదాసి ఆచారం ఉన్నట్లు రాసి ఉంది. సమాజంలో శెట్టిలు(వ్యాపారులు), జీతిక అనే వృత్తిపనివారు ఉన్నారని 'భితారి' శాసనంలో రాశారు. సేద్య బానిసలు, జాజ్మని అనే వ్యవస్థకు గుప్తుల కాలంలోనే పునాది పడింది. ఈ వ్యవస్థకు గల కారణాలు 'ఇండోర్' శాసనంలో ఉన్నాయి.

నలంద విశ్వవిద్యాలయం

దీనిని కుమారగుప్తుడు నిర్మించాడు. తరవాత పుష్యభూపతి వంశంలో హర్షుడు ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేశాడు. ఆ తరవాత పాలరాజులకు చెందిన ధర్మపాలుడు కూడా ఈ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేశాడు. సంస్కృతంలో 'నలం' అంటే జ్ఞానం లేదా పద్మం అని, 'ద' అంటే ఇవ్వడం అని అర్థం. నలంద విశ్వవిద్యాలయంలో మూడు గొప్ప గ్రంథాలయాలు ఉన్నాయి. వీటికి తురుష్కరాజులు సహాయం చేశారు. 12వ శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ చేతిలో ఈ విశ్వవిద్యాలయం పతనం చెందింది.



ఆర్థిక విధానం

భూములను సామంతులకు, ఉద్యోగులకు, బ్రాహ్మణులకు దానాలుగా ఇవ్వడం వల్ల రాజుకు భూమిపై అధికారం తగ్గింది. రాజుకు, సాగుచేసే సామాన్య రైతుకు మధ్య అనేక మంది మధ్యవర్తులు ఉండటంతో ఫలితాన్ని అనుభవించే భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. ఈ భూస్వామ్య వ్యవస్థ గురించి 'భితారి' శాసనంలో రాశారు. 'సార్థవాహనులు' అనే సంచార వర్తకులు కూడా నగరాల్లో ఎక్కువగా ఉండేవారు. రైతులపై హిరణ్య(నగదు పన్ను); కొనుగోలు మీద వేసే క్లిప్త, ఉపక్లిప్త పన్నులు; అమ్మకపు పన్ను; వ్యవసాయానికి వాడుకునే నీటిపై వేసే వత భూత పన్ను గుప్తుల కాలంలో విధించేవారు.

భూ విభజన: భూములను ఖిల్ల(వ్యవసాయ), క్షేత్ర(నివాస), స్థల(అటవీ) అని మూడు రకాలుగా విభజించారు.

నాణేలు: కంస, సిక్క.

విదేశీ వాణిజ్యం: గుప్తులు ఎక్కువగా ఆగ్నేయాసియా దేశాలతో వర్తక వాణిజ్యాలు నిర్వహించేవారు. అరికమేడు, ముజ్రిస్, కావేరి రేవు పట్టణాలు ప్రసిద్ధి. పర్షియా, అరేబియా, ఆఫ్ఘానిస్థాన్ దేశాల నుంచి గుర్రాలను దిగుమతి చేసుకునే వారు.

మత విధానం

వైదిక మతం పునరుద్ధరించారు. క్రతువులు, యజ్ఞయాగాలు పెరిగాయి. వేదాలు వినడం, ఇతిహాసాలు చదవడానికి శూద్రులకు అవకాశం కల్పించారు. దశావతారాలు, త్రిమూర్తులను నాటి ప్రజలు పూజించేవారు. బౌద్ధ, జైన మత సూత్రాలను హిందూ మతం గ్రహించింది. శైవ మతానికి ఆదరణ పెరిగింది. మూఢ నమ్మకాలు కూడా పెరిగాయి. విగ్రహారాధన స్థిరపడింది.

వైష్ణవం: ఈ మతంలో నూతన శాఖలు ఏర్పడ్డాయి. పంచరాత్రి, వైఖానస మొదలైన శాఖలు ఏర్పడ్డాయి. రెండో చంద్రగుప్తుడు పరమ భాగవతుడని పేరు పొందాడు.

శైవం: శైవంలో తాంత్రిక శాఖలు, భక్తి శాఖలు ఏర్పడ్డాయి. వీటిని కాపాలిక, కాలాముఖ శాఖలు అనేవారు. మితవాద శాఖలు కూడా ఉండేవి. శివున్ని లింగ రూపంలో పూజించడం ప్రారంభించారు. ఇది మొదట కశ్మీర్‌లో ప్రారంభమైంది. అభినవ గుప్తుడు త్రిక అనే శాఖను ప్రారంభించాడు. వసుగుప్తుడు ప్రత్యాభిజ్ఞా అనే శైవ శాఖను ప్రారంభించాడు.

జైన మతం: అనేక జైన స్థావరాలు నిర్మించారు. గుజరాత్‌లో జైనమతం అభివృద్ధి చెందింది.

బౌద్ధ మతం: అనేక ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు నిర్మించారు. బుద్ధగయలో బౌద్ధ విహారం నిర్మించడానికి శ్రీలంక రాజు మేఘవర్ణుడికి సముద్రగుప్తుడు అనుమతించి పరమత సహనం చాటాడు. మథుర, సార్‌నాథ్, కోశాంబి మొదలైనవి బౌద్ధ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. అసంగుడు, పరమార్థుడు, దిగ్నాగుడు ఈ కాలపు గొప్ప బౌద్ధ పండితులు.

గుప్తుల పరమత సహనం: గుప్తులు హిందూ మతాభిమానులైనా...పరమత సహనం చూపారు. బౌద్ధ, జైనులకు పదవులు ఇచ్చారు. దానాలు చేశారు. విరాళాలు ఇచ్చారు. రెండో చంద్రగుప్తుని సేనాని 'అమరక దేవుడు' బౌద్ధుడు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

సాహిత్యం

గుప్తుల కాలం సాహిత్యానికి స్వర్ణయుగం అని చెప్పవచ్చు. సముద్రగుప్తుడు స్వయంగా కవి. అతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉండేది. రెండో చంద్రగుప్తుని కాలంలో 'నవరత్నాలు' అని పేరుపొందిన కవులు ఉండేవారు. వారిలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కాళిదాసు ఒకరు. ఈయన రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం' గ్రంథాన్ని సర్ విలియం జోన్స్ ఆంగ్లంలోకి అనువదించాడు. 'మాళవికాగ్నిమిత్రం' నాటకంలో ఉజ్జయిని రాకుమార్తె మాళవికను మగధ యువరాజు అగ్నిమిత్రుడు చేసుకున్న వివాహం(రాక్షస వివాహం) గురించి కాళిదాసు అద్భుతంగా రాశాడు.

గుప్తుల కాలంలో కొనసాగిన సాహిత్య సేవను చరిత్రకారులు గ్రీస్‌లోని పెరిప్లస్ యుగంతో, రోమ్‌లోని అగస్టస్ యుగంతో, ఇంగ్లాండ్‌లోని ఎలిజబెత్ యుగంతో పోల్చారు. గుప్త రాజులు సంస్కృత, సాహిత్య రంగాల్లో చేసిన సేవల వల్లనే వారి యుగానికి స్వర్ణయుగం అనే పేరు వచ్చింది. గుప్త చక్రవర్తులు స్వయంగా పండితులు. అలహాబాద్ ప్రశస్తి శాసనంలో కావ్యశైలిలో హరిసేనుడు అద్భుతంగా రాశాడు.

నవరత్నాలలో ఒకడైన కాళిదాసు రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం అనే కావ్యాలు రాశాడు. అదేవిధంగా ఇతర కవుల గ్రంథాలు... శూద్రకుడు - మృచ్ఛకటికం; విశాఖదత్తుడు- ముద్రా రాక్షసం, దేవీచాంద్రగుప్తం; భానుడు- వాసవదత్త, విష్ణుశర్మ- పంచతంత్రం మొదలైనవి. అమరసింహుడు 'అమరకోశం' అనే వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. కామాంధకుడు 'నీతి శాస్త్రం' రచించాడు. ఇది గుప్తుల కాలంలో వచ్చిన రాజకీయ గ్రంథం. మౌర్యుల అర్థ శాస్త్రంతో పోల్చదగినది.

వేదాంత శాస్త్రాలు: ఈ కాలంలో అద్భుతమైన గ్రంథాలు వచ్చాయి. అసంగుడు బౌద్ధ గ్రంథాలపై వ్యాఖ్యానాలు రాయగా, దిగ్నాగుడు ప్రమాణచముచ్చేయం రాసి తర్కశాస్త్ర పితగా ప్రసిద్ధి చెందాడు. అష్టాదశ పురాణాలను ఈ కాలంలోనే రాశారు. మనుధర్మశాస్త్రం, యజ్ఞవల్క్యస్మృతి మొదలైనవి ఈ కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

విజ్ఞానశాస్త్ర గ్రంథాలు: గుప్తుల కాలంలో సాహిత్యంతోపాటు విజ్ఞాన శాస్త్రం కూడా అభివృద్ధి చెందింది. గణిత, ఖగోళ, భౌతిక, వైద్యశాస్త్రాలు అభివృద్ధి చెందాయి. దశాంశ పద్ధతి, సున్నా విలువలు వాడుకలోకి వచ్చాయి. రెండో చంద్రగుప్తుడు ఉజ్జయినిలో నక్షత్రశాలను నెలకొల్పాడు. మెహరోలిలో నక్షత్రాల పరిశీలన కోసం వరహమిహిరుడికి రెండో చంద్రగుప్తుడు ఎత్తయిన ఇనుప స్తంభం నిర్మించి ఇచ్చాడు. రోమక, జాతక, లఘు అనే గణితశాస్త్ర గ్రంథాలను వరహమిహిరుడు రాశాడు. అదేవిధంగా బృహత్‌సంహిత గ్రంథంలో భూగోళ, ఖగోళ, జ్యోతిష, వృక్ష శాస్త్రాల గురించి రాశాడు. ఆర్యభట్టీయం, సూర సిద్ధాంతాలను ఆర్యభట్టు రచించాడు. వీటిలో సూర్య, చంద్ర గ్రహణాల గురించి వివరించాడు. వాగ్భటుడు వైద్యంలో అష్టాంగ సంగ్రహం అనే గ్రంథం రాశాడు. పాలకశ్యపుడు హస్తాయుర్వేదంలో పశు వైద్యం గురించి రాశాడు. ధన్వంతరి, శుశ్రుతుడు గుప్తుల కాలంలో గొప్ప వైద్యులు.



డాక్టర్ ఐ. నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల
డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

కోడింగ్ - డీకోడింగ్

రీజనింగ్

పోటీపరీక్షల ప్రత్యేకం

పార్ట్-3

1. ఒక కోడ్ భాషలో MERITను 7, 18, 9, 22, 14గా రాశారు. అదే కోడ్ భాషలో PONDSను ఏ విధంగా రాస్తారు?

ఎ) 11, 12, 23, 13, 8 బి) 11, 13, 12, 8, 23 సి) 8, 23, 13, 12, 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: MERIT అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా M అనగా 14వ అక్షరం, E అనగా 22, R అనగా 9, I అనగా 18, T అనగా 7. ఈ సంఖ్యలను రివర్స్ చేయగా 7, 18, 9, 22, 14. ఇదే విధంగా PONDS అనే పదాల్లోని అక్షరాలకు అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా P అనగా 11, O అనగా 12, N అనగా 13, D అనగా 23, S అనగా 8. కావున 8, 23, 13, 12, 11 అనగా 'సి' సమాధానం అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో LUNCHను 58గా రాశారు. అదే కోడ్ భాషలో FRUITను ఏ విధంగా రాస్తారు?

ఎ) 74 బి) 68 సి) 72 డి) ఏదీకాదు

సమాధానం:(ఎ)

వివరణ: LUNCH అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా L అనగా 12, U అనగా 21, N అనగా 14, C అనగా 3, H అనగా 8, 12+21+14+3+8=58. ఇదే విధంగా PONDS అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా F అనగా 6, R అనగా 18, U అనగా 21, I అనగా 9, T అనగా 20. కావున 6 +18+21 + 9 + 20=74 సమాధానం అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో BIGను 324గా రాశారు. అదే కోడ్ భాషలో ACTను ఏ విధంగా రాస్తారు?

ఎ) 576 బి) 529 సి) 676 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: BIG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 9, 7 వీటిని కూడగా 2+9+7=18. ఈ 18 వర్గం (స్క్వేర్) 324. అదే విధంగా ACT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 3, 20 వీటిని కూడగా 1+3+20=24. ఈ 24 వర్గమే (స్క్వేర్) 576.

4. ఒక కోడ్ భాషలో AIMను 251గా రాశారు. అదే కోడ్ భాషలో INKను ఏ విధంగా రాస్తారు?

ఎ) 416 బి) 398 సి) 264 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: AIM అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 9, 13. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $1^2, 9^2, 13^2$ = 1+81+169=251 అదే విధంగా INK అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 9, 14, 11. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $9^2, 14^2, 11^2$= 81+196+121=398 సమాధానం అవుతుంది.

5. ఒక కోడ్ భాషలో HATను 160గా రాశారు. అదే కోడ్ భాషలో 'PAN'ను ఏ విధంగా రాస్తారు?

ఎ) 224 బి) 242 సి) 422 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: HAT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 8, 1, 20. వీటిని గుణించగా 8x1x20=160 అదే విధంగా PAN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 16, 1, 14 వీటిని గుణించగా 16x1x14 = 224 సమాధానం అవుతుంది.

6. ఒక కోడ్ భాషలో PLANEను 96గా రాశారు. అదే కోడ్ భాషలో SOLVEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 142 బి) 144 సి) 146 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: PLANE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు P అనగా 16, L అనగా 12, A అనగా 1, N అనగా 14 E అనగా 5 వీటిని కూడగా 16+12+1+14+5=48కి రెట్టింపు 96. అదే విధంగా SOLVE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు S అనగా 19, O అనగా 15, L అనగా 12, V అనగా 22, E అనగా 5 వీటిని కూడగా 19+15+12+22+5=73 కి రెట్టింపు 146 సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో SMART ను 128గా రాశారు. అదే కోడ్ భాషలో RANGEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 180 బి) 160 సి) 168 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: SMART అనే పదంలోని అక్షరాలకు అపసవ్య దిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా S అనగా 8, M అనగా 14, A అనగా 26, R అనగా 9, T అనగా 7. వీటిని కూడగా 8+14+26+9+7=64కి రెట్టింపు 128. ఇదేవిధంగా RANGE అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు R అనగా 9, A అనగా 26, N అనగా 13, G అనగా 20, E అనగా 22 వీటిని కూడగా 9+26+13+20+22=90 రెట్టింపు 180 సమాధానం అవుతుంది.

8. ఒక కోడ్ భాషలో LIKEను 33గా రాశారు. అదే కోడ్ భాషలో EARNను ఏ విధంగా రాస్తారు?

ఎ) 34 బి) 38 సి) 37డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: LIKE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 12+9+11+5=37. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 37 నుంచి 4 తీసివేస్తే 37-4=33. అదే విధంగా EARN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 5+1+18+14=38. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 38 నుంచి 4 తీసివేస్తే 38-4=34 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దక్షిణ భారత్‌కూ బుల్లెట్ రైలు

- 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నిర్వహిస్తాం..
- ఇంటింటికీ నీరు, పైప్‌లైన్‌తో గ్యాస్
- అన్నదాతలందరికీ డ్రోన్లు
- ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం
- బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు



బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న మోదీ, నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. మళ్లీ అధికారంలో వస్తే ఐదేళ్లలో ఏం చేస్తామో చెబుతూ.. దేశ ప్రగతి, యువత, మహిళలు, పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆ పార్టీ అగ్రనేతలు ఆవిష్కరించారు. మోదీకి గ్యారెంటీ శీర్షికతో ఉన్న ఈ మ్యానిఫెస్టోను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ఆదివారం మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ దక్షిణాదికీ బుల్లెట్ రైలు సేవలను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర, తూర్పు భారత్‌కూ బుల్లెట్ రైలు వేస్తామన్నారు. దీనిపై త్వరలో సర్వే ప్రారంభం కానుందని పేర్కొన్నారు. శరవేగంగా సాగుతున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు పనులు పూర్తయ్యే దశకు వచ్చాయని.. ఈ అనుభవంతో మిగతా మూడు ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పారు. వందే భారత్ రైలు సేవలను దేశవ్యాప్తం చేస్తామన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని తెలిపారు. ముద్ర పథకం రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ నీరు, పైప్ ద్వారా గ్యాస్ అందిస్తామని హామీ ఇచ్చారు. పీఎం సూర్య ఘర్ ద్వారా జీరో పవర్ బిల్‌ను సాకారం చేస్తామన్నారు. మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ అందిస్తామని మోదీ తెలిపారు. ఇప్పటికే 4కోట్ల ఇళ్లు కట్టించామని.. మధ్య తరగతికి మరో 3కోట్ల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు.

నాలుగు స్తంభాలతో సంకల్ప్ పత్ర

పేదలు, యువశక్తి, అన్నదాత, నారీశక్తి.. అనే నాలుగు స్తంభాలపై సంకల్ప్ పత్రకు పునాదులు వేశామని మోదీ వెల్లడించారు. పదేళ్లలో ఎంతో ప్రగతిని సాధించామని, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని అందుకే బీజేపీ మ్యానిఫెస్టో కోసం యావత్ దేశం ఎదురుచూసిందని చెప్పారు. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెంచుతామని మోదీ చెప్పారు. ప్రతి రైతు ఇంటిపై డ్రోన్లు తిరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారిన అవినీతిని అంతమొందించడానికి ఎంతో చేశామని, భవిష్యత్తులోనూ దీనిని కొనసాగిస్తామని చెప్పారు. 140 కోట్ల మంది ప్రజలను దృష్టిలో పెట్టుకుని మ్యానిఫెస్టోను తయారు చేసామని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. మోదీ గ్యారెంటీపత్రం 24 క్యారెట్ల బంగారంతో సమానమన్నారు. మోదీ గ్యారెంటీ, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాలుగా పేర్కొన్న బీజేపీ మ్యానిఫెస్టో తొలి కాపీలను ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన నలుగురికి అందజేశారు. విశ్వబంధు, స్వస్థ భారత్, సురక్షిత భారత్, సుస్థిర భారత్, సమృద్ధ భారత్, సాంకేతిక, ప్రపంచ తయారీ కేంద్రం, అత్యుత్తమ శిక్షణ, క్రీడా, సాంస్కృతిక వికాసం, ఈజ్ ఆఫ్ లివింగ్, సుపరిపాలన అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

మ్యానిఫెస్టోలోని కీలక అంశాలు

ట్రాన్స్‌జెండర్లకూ ఆయుష్మాన్ భారత్; వందేభారత్ స్లీపర్, చైర్ కార్, మెట్రో రైల్ సర్వీసుల ప్రారంభం; జాతీయ విద్యా విధానం అమలు; 2036లో ఒలింపిక్స్ నిర్వహణ; పీఎం ఆవాస్ యోజనలో దివ్యాంగులకు ప్రాధాన్యం; యువతకు మౌలిక సదుపాయాల కల్పన; పర్యాటక రంగంలో లక్షల ఉద్యోగాల కల్పన; 3కోట్ల మంది మహిళలను లక్షాధికారుల చేసే లక్ష్యం; ఈశాన్యంలో సైన్యానికి ప్రత్యేకాధికారాల చట్టం క్రమంగా ఎత్తివేత; ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా గిగ్ వర్కర్లు, ట్యాక్సీ, ఆటో, ట్రక్కు డ్రైవర్లకు సంక్షేమ పథకాలు; తిరువళ్లూర్ కల్చరల్ సెంటర్ ద్వారా భారత సంస్కృతి ప్రపంచ దేశాలకు పరిచయం; ఉన్నత విద్యాసంస్థల్లో భారతీయ భాషల అధ్యయనానికి తోడ్పాటు; ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి ప్రయత్నం; ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా శాటిలైట్ పట్టణాలు; ఏకలవ్య పాఠశాలలు, పీఎం జన్‌మన్ పథకాలకు ప్రాధాన్యం; అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం.

నిరుద్యోగం కనపడలే.. ద్రవ్యోల్బణం వినపడలే

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

దేశ ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అనే అంశాలు బీజేపీ మ్యానిఫెస్టోలో లేనే లేవని, మోదీ ప్రసంగంలోనూ వినపడలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. ఈమేరకు ఆయన ట్వీట్ చేశారు. ఈ రెండు అంశాలపై చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని విమర్శించారు. యువత ఈసారి మోదీ వలలో పడదని, ఉపాధి విప్లవం రాబోతోందని వ్యాఖ్యానించారు. కాగా, మోదీ గ్యారెంటీ ఒక జుమ్లా అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు ఆదాయం రెట్టింపు చేశారా? అని నిలదీశారు. దక్షిణాదికీ బుల్లెట్ రైలు అంటున్నారని.. మొదటి బుల్లెట్ రైలే ఇంకా పట్టాలెక్కలేదని ఎద్దేవా చేశారు.

సెల్ టవర్ లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్స్‌లో చైనా విప్లవాత్మక ఆవిష్కరణను తీసుకొచ్చింది. భూమిపై ఉన్న సెల్ టవర్ల అవసరం లేకుండా నేరుగా స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్‌ను సాధ్యం చేయగలిగేలా ప్రపంచంలోనే మొదటి ఉపగ్రహాన్ని ఆ దేశ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్వర్గంతో కనెక్ట్ అవ్వడం అని అర్థం వచ్చేలా దీనికి 'టియాంటాంగ్' అని దీనికి పేరుపెట్టారు. ఎనిమిదేళ్ల క్రితం చైనా రోదసీలోకి పంపిన 'టియాంటాంగ్-1' ఉపగ్రహ శ్రేణి ప్రస్తుతం మూడుకు చేరింది. ఇవి జియోసింక్రోనస్ కక్ష్యలో తిరుగుతూ మొత్తం ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని కవర్ చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతమంతా మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీకి మార్గం సుగమమైంది. చైనాకు చెందిన 'హువావే' ఇప్పటికే ప్రపంచంలోనే శాటిలైట్ కనెక్టివిటీని సపోర్ట్ చేసే మొదటి మొబైల్ కంపెనీగా గుర్తింపు పొందింది. హువావే టెక్నాలజీస్ గతేడాది సెప్టెంబరులో శాటిలైట్ కాల్స్‌కు మద్దతునిచ్చే స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ జాబితాలో షియోమి, హానర్, ఒప్పో వంటి మొబైల్ కంపెనీలు కూడా చేరాయి. గతేడాది డిసెంబరు 18న చైనాలోని గాన్సు ప్రావిన్స్‌లో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు.. సాంప్రదాయ కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయలేదు. ఈ సమయంలో బాధితుల్లో కొందరు శాటిలైట్ కాల్ సౌకర్యం ద్వారా బాహ్య ప్రపంచంతో సమాచారాన్ని పంచుకోగలిగారు.

పుంగనూరు ప్రజల గొంతుకనవుతా

● రౌడీయిజాన్ని అణగదొక్కుతా! ● నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నెంబరు వన్ చేస్తా
● భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్రయాదవ్



గత ఎన్నికల్లో అప్పటికి పెద్దగా బలం లేని పార్టీ తరపున పోటీచేసి స్వల్ప వ్యవధిలోనే బలమైన ప్రత్యర్థిని ఢీకొని 16 వేల ఓట్లు సాధించి సంచలనం సృష్టించిన నేత ఆయన. ఓటమికి వెరవక.. అధికార బలం తోడైన అదే ప్రత్యర్థికి ఐదేళ్లుగా సవాలు విసురుతున్న నాయకుడాయన. పోలీసులతో అడుగడుగునా అడ్డుకుంటున్నా లెక్క చేయక నియోజకవర్గ ప్రజలకు సాయం చేసేందుకు నిరంతరం యత్నించిన సాహసికుడాయన. పార్టీలు, ప్రభుత్వాల సాయం లేకున్నా వ్యక్తిగత ధనంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న సామాజిక సేవకుడాయన. పుంగనూరు నియోజకవర్గంలో వేళ్లూనుకపోయిన రౌడీయిజాన్ని కూకటివేళ్లతో పెకలించి ప్రశాంత వాతావరణం తెస్తానని ధీమా వ్యక్తం చేస్తున్న భారత చైతన్య యువజన పార్టీ అధినేత, ఆ పార్టీ అభ్యర్థి బోడె రామచంద్ర యాదవ్ తన అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

- పుంగనూరు

రౌడీయిజం అణచివేతే ఎన్నికల నినాదం

పుంగనూరు నియోజకవర్గంలో రౌడీయిజం అణచివేతే ఈ ఎన్నికల్లో నా నినాదం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అతడి కుటుంబం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళతా. రౌడీయిజాన్ని అణచివేసి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం తీసుకు రావడం, రైతులు, యువత సమస్యలు పరిష్కరించడం, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా అభివృద్ధి పరచడం వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా ఎంచుకుంటున్నా. ఐదేళ్లుగా అధికార పార్టీ సాగించిన దౌర్జన్యాలు, రైతులను దోపిడీ చేయడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం, ఎన్నికల్లో రౌడీయిజంతో ఏకగ్రీవాలు చేసుకోవడం వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తా.

నాడు రాజకీయ మార్పు కోసం.. నేడు అభివృద్ధి కోసం

పుంగనూరులో రాజకీయ మార్పు కోసం 2019లో పోటీ చేశా. ఇప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి పోటీ చేస్తున్నా. గతంలో సమయం తక్కువగా ఉండటం, నేను ఎంచుకున్న పార్టీకి బలమైన క్యాడర్ లేకపోవడం వంటి కారణాలతో కేవలం 16 వేల ఓట్లే వచ్చాయి. ఇప్పుడు ఐదేళ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతున్నా. పుంగనూరు ప్రజల గొంతుకగా మారి.. వారి వాణి వినిపిస్తున్నా. రైతులు, యువత సమస్యల గురించి పట్టించుకునే పార్టీలు, నాయకులు ఇప్పుడు లేరు. అందుకే వారి వెతలు తీర్చడం కోసమే కొత్తగా పెట్టిన పార్టీ తరపున పోటీ చేస్తున్నా.

వంద శాతం గెలుస్తా

పుంగనూరు ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఐదేళ్లుగా నేను చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తిస్తున్నారు. రౌడీయిజానికి వెరవకుండా నేను సాగిస్తున్న పోరాటాన్నీ గమనిస్తున్నారు. కరోనా కాలంలో చేపట్టిన సహాయక చర్యలతో కష్టకాలంలో అండగా ఉంటానని నమ్ముతున్నారు. వీటికితోడు అధికార పార్టీ నేతల అరాచకాలతో విసిగిపోయి ఉన్న ప్రజలు.. ఈసారి నన్ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో వందశాతం విజయం సాధిస్తా.

ఇదీ నా మ్యానిఫెస్టో

నియోజకవర్గంలో మెడికల్ కళాశాల, పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి 500 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తా. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులో తేవడానికి ట్రిపుల్ ఐటీ మంజూరు చేయిస్తా. ఉర్దూ బాలికల కోసం డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయిస్తా. మామిడి, చింతపండు, టమోటా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా మార్కెట్లలో ఆయా పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తా. అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయించి వేలాది మందికి ఉపాధి దొరికేలా చూస్తా. చెరకు రైతులను ఆదుకునేందుకు చక్కెర ఫ్యాక్టరీ పెట్టిస్తా. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక పారిశ్రామిక వాడ (జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి) ఏర్పాటుకు కృషి చేస్తా. పులిచెర్ల నుంచీ కేజీఎఫ్ వరకూ రైల్వే లైను వేయించడానికి ప్రయత్నిస్తా. హంద్రీ-నీవా ప్రాజెక్టు పూర్తి చేయించడంతో పాటు ఉప కాలువల నిర్మాణంపై దృష్టి పెడతా. చౌడేపల్లె నుంచి సోమల వరకూ హంద్రీ-నీవా జలాలు తరలించి మెట్ట భూములకు సాగు నీరందించడానికి ప్రయత్నిస్తా.



పెద్దిరెడ్డి బాధితులే నా బలం

పుంగనూరులో పదిహేనేళ్లుగా రౌడీయిజం, గూండాయిజాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెంచి పోషించారు. అధికార బలంతో ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దోపిడీలు సాగించారు. వందలాది మందిపై తప్పుడు కేసులు పెట్టించారు. రౌడీషీట్లు తెరిపించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకం సృష్టించారు. కనీసం స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వేచ్ఛగా నామినేషన్ వేసే అవకాశం కూడా లేకపోయింది. పాడి రైతులు స్వేచ్ఛగా తమకు నచ్చిన డెయిరీలకు పాలు పోసే అవకాశాన్నీ లేకుండా చేశారు. ఇలా చెప్పుకొంటూ పోతే మంత్రి పెద్దిరెడ్డి బాధితులకు అంతూపొంతూ వుండదు.వీరే నా బలం. పుంగనూరులో రౌడీయిజాన్ని అణచివేసి శాంతిభద్రతలు కాపాడడానికి వారంతా నాకు మద్దతుగా నిలుస్తారని నమ్ముతున్నా.

ప్రతి రైతుకూ నా డబ్బుతో ఆవులు అందజేస్తా

ఎన్నికల్లో నేను విజయం సాధిస్తే ప్రభుత్వం ద్వారానే కాకుండా వ్యక్తిగతంగానూ నియోజకవర్గ ప్రజలకు సాయమందిస్తా. ప్రతి రైతుకూ పాడి యావులిస్తా. అన్ని మండల కేంద్రాల్లో డెయిరీలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందిస్తా. ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్ళిన యువతను తిరిగి పుంగనూరు రప్పించి ఇక్కడే ఉద్యోగావకాశాలు కల్పిస్తా. ప్రతి గృహిణీ నెలకు కనీసం రూ.15 వేలు ఆదాయం పొందేలా స్వయం ఉపాధి సాధించేందుకు శిక్షణ, ప్రోత్సాహం అందిస్తా. అయ్యప్ప భక్తులకు ఏటా పుంగనూరు నుంచి శబరిమల వెళ్ళడానికి ఉచితంగా బస్సులు ఏర్పాటు చేస్తా. మక్కా వెళ్ళాలనుకునే ముస్లింలకు ఏటా ప్రయాణ ఖర్చులకు సాయం అందిస్తా.

పుంగనూరుకు పెద్దిరెడ్డి చేసిందేమీ లేదు

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రజా బలం లేదు. ఆయనది ఆర్థిక బలం. ప్రభుత్వం ఉండటంతో అధికార బలం ప్రదర్శిస్తున్నారు. అధికారం లేకపోతే పెద్దిరెడ్డికి బలం లేదు. మూడుసార్లు పుంగనూరు ప్రజలు గెలిపించినా ఆయన నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. మాదక ద్రవ్యాలతో యువతను భ్రష్టు పట్టించారు. రైతులకు, వ్యవసాయ రంగానికి ఉపయోగపడేందుకు కాకుండా సొంత ఆదాయం కోసం సాగునీటి ప్రాజెక్టులు తలపెట్టారు. వాటి ద్వారా రూ. వందల కోట్లు స్వాహా చేసేందుకు యత్నించారు. చివరికి గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలతో ఆ పనులన్నీ ఆగిపోయాయి. ఇవన్నీ గమనిస్తున్న పుంగనూరు ప్రజలు.. ఈ ఎన్నికల్లో వైసీపీకి సమాధి కట్టడానికి సిద్ధంగా వున్నారు.

అధికారం లేకున్నా పోరాడుతున్నా

నాకు ఎలాంటి అధికారం, పదవీ లేకపోయినా నియోజకవర్గంలో దౌర్జన్యకర పరిస్థితులపై పోరాడుతున్నా. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారు. ఎలాగోలా కొందరు వేస్తే.. అధికారులపై ఒత్తిడి తెచ్చి తిరస్కరింప చేశారు. సదుం, పులిచెర్ల, చౌడేపల్లె, పుంగనూరు మండలాల్లో నామినేషన్లు వేయడానికి వచ్చిన ప్రతిపక్ష అభ్యర్థులపై పోలీసులు, అధికారుల సమక్షంలోనే దాడులు చేసి తరిమేశారు. నామినేషన్లు వేయడానికి గోడలు దూకి వెళ్లిన మహిళా అభ్యర్థులనూ పోలీసులు అడ్డుకున్నారు. ఈ బాధితులను చిత్తూరు ఎస్పీ, గవర్నర్ వద్దకు తీసుకెళ్లి ఫిర్యాదులు చేశా. బాధితులకు న్యాయం జరగడం కోసం హైకోర్టులో కేసులు వేశా.

యువతకు ఉద్యోగాలు రాకుండా అడ్డుపడ్డారు

పుంగనూరులో పదివేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 2022 డిసెంబరు 22న మెగా జాబ్‌మేళాకు వంద కంపెనీలను ఆహ్వానించా. సొంతస్థలంలో ఏర్పాట్లు చేశా. దానికి ముందురోజు అనుమతి లేకుండా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని వంకపెట్టి 30 పోలీస్‌యాక్టు, 144 సెక్షన్ విధించారు. జాబ్‌మేళా స్థలం వివాదంలో ఉందని, నిరుద్యోగులు హాజరుకారాదని, ఏర్పాట్లను ధ్వంసం చేశారు. గతేడాది సెప్టెంబరు 3వ తేదీన విజయవాడలో బీసీవై పార్టీ తరపున మెగా జాబ్‌మేళా నిర్వహిస్తే 80 వేల మంది నిరుద్యోగులు వచ్చారు. 560 కంపెనీల ద్వారా 32 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించా.

రోడ్డుపై అడ్డుకుంటే హెలికాప్టర్‌లో పర్యటించా

మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ కంపెనీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవులపల్లె, కురబలకోట మండలం ముదివేడు వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించారు. ఈ ప్రాజెక్టులను సందర్శించి అవకతవకలను ప్రజలకు వివరించాలని బయల్దేరితే పోలీసులు అడ్డుకుని కేసులు పెట్టారు. దీంతో హెలికాప్టర్‌లో మూడు ప్రాజెక్టులను సందర్శించా. జిల్లాలో మంత్రి దౌర్జన్యాలకు ఇంతకు మించిన నిదర్శనం ఏముంటుంది?

కేంద్రం నుంచి రక్షణ పొందా

2022 డిసెంబరు 4వ తేదీ మంత్రి అనుచరులు 300 మంది నా ఇంటిపై దాడి చేశారు. నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా ఉన్నవారిపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా, వారి ఆస్తులు ధ్వంసం చేస్తున్నా పోలీసు యంత్రాంగం ఎలాంటి రక్షణ కల్పించలేదు. వీటిపై కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షాకు ఫిర్యాదు చేయడంతో నాకు వై ప్లస్ భద్రత కల్పించారు.

మంత్రి, ముఖ్యమంత్రుల అవినీతిపైనే ఫిర్యాదు చేశా

మంత్రి పెద్దిరెడ్డి అవినీతిపై పోరాడుతున్నా. రూ.35 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశా. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ పులివెందుల పోలీస్‌స్టేషన్లోనే ఫిర్యాదు చేశా. నాపై ఇప్పటి దాకా పోలీసులు 47 కేసులు నమోదు చేశారు. అయినా భయపడే ప్రసక్తే లేదు. పుంగనూరులో అరాచక శక్తులను తరిమికొట్టే వరకూ నా పోరాటం కొనసాగుతుంది.

రైతుల రక్తం తాగుతున్నారు

సదుం మండలంలో మంత్రికి చెందిన డెయిరీ.. మిగిలిన ప్రైవేటు డెయిరీలకంటే కూడా చాలా తక్కువగా పాడి రైతులకు ధర ఇస్తున్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, దాడులు జరుగుతున్నాయి. బయటి డెయిరీలు రాకుండా పాలవ్యాన్లపై దాడులు చేయడం, పాలక్యాన్లు గ్రామాల్లో తీసుకోకుండా దౌర్జన్యాలు చేస్తున్నారు. నష్టాలు భరించలేక చాలా మంది రైతులు పాడియావులను తెగనమ్మేసుకుంటున్నారు. పాడి రైతుల రక్తం తాగుతున్న అధికార పార్టీ నేతలకు తగిన బుద్ధి చెప్పి, పాడి రైతుల దోపిడీని ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేసేందుకు 2022 నుంచి రైతుభేరి బహిరంగ సభ నిర్వహణకు మూడుసార్లు ప్రయత్నించినా అడ్డుపడ్డారు. హైకోర్టు అనుమతించినా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసు 30 యాక్టు, 144 సెక్షన్ విధించి ఇంటి నుంచి బయటకు రానివ్వలేదు. చివరకు హైకోర్టు ఆదేశాలతో పుంగనూరులోని నా మామిడితోటలో రైతుభేరి సభ నిర్వహించా.

ఘనంగా మారుతి హాస్పిటల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ జగదీష్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 14: తిరుపతి లీలామహల్ సెంటర్, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా మినర్వా గ్రాండ్ హోటల్ పక్కన ఉన్న శ్రీమారుతి హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జగదీష్, ప్రొఫెసర్ గణపతిభట్, మారుతి హాస్పిటల్ చైర్మన్ రామకృష్ణనాయుడు జ్యోతి ప్రజ్వళన చేశారు. డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ గుండెకు సంబంధించి మేజర్ ఆపరేషన్లకు చెన్నై, హైదరాబాదు వంటి మహానగరాలకు వెళ్లే అవసరం లేకుండా తిరుపతిలోనే అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్థోకు సంబంధించి ఏడాదిలో 100కు పైగా మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేసిన ఏకైక హాస్పిటల్‌గా మారుతి నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హాస్పిటల్ సిబ్బందికి జ్ఞాపిక బహూకరించారు.

ఎస్‌ఐ జీపు డ్రైవర్ ఆత్మహత్య



సందీప్ (ఫైల్ ఫొటో)

కార్వేటినగరం, ఏప్రిల్ 14: కార్వేటినగరం ఎస్‌ఐ వద్ద తాత్కాలికంగా పనిచేస్తున్న జీపు డ్రైవర్ సందీప్(27) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్‌ఐ వెంకటకృష్ణ కథనం మేరకు... పాదిరికుప్పానికి చెందిన ఇతడు కొబ్బరిబోండాలు విక్రయించి జీవనం సాగించే వాడన్నారు. వారం కిందటే తన వద్ద తాత్కాలికంగా జీపు డ్రైవర్‌గా చేరాడన్నారు. ఇతడు ఇంటికి రాలేదని సందీప్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించగా, పద్మసరస్సు వద్ద మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. కుటుంబ కలహాల వల్లే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోను చార్జింగ్ పెడుతుండగా..



హిమాచల మందడి (ఫైల్ ఫొటో)

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 14: గానుగ షెడ్ వద్ద సెల్‌ఫోను చార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఎస్‌ఆర్‌పురం మండలం ఎస్‌ఆర్‌పురం గ్రామానికి చెందిన హిమాచల మందడి(37) ఆదివారం మృతిచెందారు. ఇతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కుళాయప్ప తెలిపారు.

కాణిపాకంలో ఘనంగా తమిళ నూతన సంవత్సరాది



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 14: కాణిపాక వినాయకస్వామి ఆలయంలో ఆదివారం తమిళ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాణిపాకానికి చెందిన దివంగత రాజమాణిక్యం కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను పుర వీధుల్లో ఊరేగించారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బలిజల సత్తా చాటాలి

టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి ● ఆత్మీయ సమావేశంలో వంగవీటి రాధా పిలుపు



టీడీపీ, వైసీపీ పాలనలో జరిగిన చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: రానున్న ఎన్నికల్లో బలిజల సత్తా చాటి.. సంఖ్యాబలం చూపాలని రాష్ట్ర కాపుసంఘం నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. చిత్తూరులోని ఆర్‌ఎల్ నాయుడు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ బలిజల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బలిజలకు వైసీపీ సరైన గుర్తింపు ఇవ్వలేదని.. బలిజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేసింది శూన్యమని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడానికే కులాల వారీగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి కనీసం రూపాయి కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు. వైసీపీలో కేవలం సీఎం జగన్ సామాజిక వర్గానికే గుర్తింపు ఉందన్నారు. టీడీపీ కూటమితోనే కాపు సామాజిక వర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో చిత్తూరు లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తమను గెలిపిస్తే నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించడానికి కృషిచేస్తామన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి తమను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం టీడీపీ, వైసీపీ పాలనలో జరిగిన చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిని పోల్చు తూ ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కటారి హేమలత, బలిజ సంఘం నేత లు డీకే బద్రినారాయణ, ఓఎం రామదాసు, కాజూరు బాలాజీ, రామ్మూర్తి,వినాయక బాలాజీ, కాజూరు రాజేష్, ఆర్‌ఎస్‌ఎల్‌ఎస్ సుబ్బా, గుర్రప్ప నాయుడు, కిషోర్, గోపి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా సమావేశానికి..

వంగవీటి రాధాకు బలిజ సేవా సమితి నేతలు, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా స్వాగతం పలికారు. తొలుత నాగయ్య కళాక్షేత్రంలోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూల మాలవేశారు. అక్కడ్నుంచి గాంధీ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, కొంగారెడ్డిపల్లె మీదుగా ఎస్టేట్‌లోని ఆర్‌ఎల్ నాయుడు కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వంగవీటి రాధాతో కరచాలనం చేయడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి యువత ఆసక్తి చూపారు. కాగా, చిత్తూరులోని మాజీ మేయర్ కటారి హేమలత నివాసానికి స్థానిక నేతలతో కలిసి వంగవీటి రాధా వెళ్లారు. ఆమె కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు.

విద్యారంగాన్ని బలోపేతంచేసే వారికే మద్దతు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 14: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే వారికే ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చిత్తూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సీపీఎస్, జీవో 117 రద్దు, పాఠశాలల విలీనం నిలుపుదల, నెలనెలా జీతం చెల్లించి, విద్యా రంగంలోని సమస్యలు పరిష్కరించే పార్టీకే యూటీఎఫ్ మద్దతు ఇస్తాం దన్నారు. గడచిన విద్యా సంవత్సరం బోధన పని కంటే బోధనేతర పనుల భారం ఉపాధ్యాయులకు ఎక్కువైన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌ఎస్ నాయుడు, రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, రెహనాబేగం, రఘుపతి, దీనావతి, ప్రకాష్, దక్షిణామూర్తి, సరిత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా చిత్తూరుకు చెందిన సురేంద్రకుమార్ నియమితులయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అనేక పదవుల్లో ఆయన పని చేశారు.

రూ.1.04 లక్షల నగదు పట్టివేత

గుడిపాల, ఏప్రిల్ 14: గుడిపాల మండలం గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద ఆదివారం సరైన రశీదులు లేని రూ.1,04,400ను ఎస్‌ఎస్‌టీ టీమ్ లీడర్ గణపతి, పోలీసులు సీజ్ చేశారు. రాణిపేట నుంచి బంగారుపాళ్యానికి వెళ్తున్న వాహనంలో ఈ నగదును పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు శ్రీహరి, మునిరత్నం, గోపి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో కొనసాగుతున్న రద్దీ



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 14: కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో ఆదివారం భక్తులరద్దీ కొనసాగుతోంది.స్వామిదర్శనార్థం వందలాదిగా భక్తులు జిల్లా నలుమూలలనుంచి విచ్చేయడంతో ఆలయ క్యూలైన్లు పూర్తిగానిండి పోయాయి.

రూ.4.7కోట్ల బంగారం, 27 లక్షల వెండి పట్టివేత

చిల్లకూరు, ఏప్రిల్ 14: బిల్లుల్లేకుండా తరలిస్తున్న బంగారం, వెండి ఆభరణాలను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బూదనం టోల్‌ప్లాజా వద్ద వున్న చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా నెల్లూరు నుంచి మదనపల్లెకు తరలిస్తున్న జీఆర్‌టీ జ్యువెలరీకిచెందిన బంగారం,వెండిని పరిశీలించామన్నారు. ధ్రువీకరణపత్రాలు లేకపోవడంతో రూ.4,79,16,247 విలువచేసే 6,986 గ్రాముల బంగారం, రూ. 27,91,879 విలువ చేసే 23,688 గ్రాముల వెండిని సీజ్ చేసి ఆదాయపన్నుశాఖకు అప్పగించామన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

జగన్ డ్రామాలను నమ్మే కాలం పోయింది : టీడీపీ

కుప్పం, ఏప్రిల్ 14: జగన్ డ్రామాలను జనం నమ్మేకాలం ఎప్పుడో పోయిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, చంద్రబాబు పీఏ మనోహర్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కోడికత్తి డ్రామాకు సీక్వెల్‌గా జగన్‌రెడ్డి, గులకరాయి డ్రామాకు తెరలేపాడన్నారు. సింపతీ కోసం ఇలాంటి డ్రామాలు ఆడడడం ఆయనకు పరిపాటేనన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు చోటు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే రాళ్ళ దాడి డ్రామా : గౌనివారి

శాంతిపురం, ఏప్రిల్ 14 : ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మరో సారి రాళ్ళ దాడి డ్రామా ఆడుతున్నాడని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శనివారం రాత్రి సీఎం జగన్‌పై జరిగిన రాళ్ళ దాడిలో ఎన్నెన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసురుతుంటే భద్రతావలయం ఏమైందని ఆయన ప్రశ్నించారు. సీఎం పర్యటన ఉందని తెలిసి ఆ సమయంలో ఆ ప్రాంతానికే కరెంటు ఎందుకు తీసేశారు ? అంతే కాకుండా చీకట్లో జగన్ రోడ్‌షోకు ఎలా అనుమతించారు ? ఇలాంటి వైఫల్యాలకు కారుకులైన డీజీపీ, నిఘా చీఫ్‌లు తక్షణమే రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు.

యువత భవితకు బాబు భరోసా : ఎమ్మెల్సీ కంచర్ల

రామకుప్పం, ఏప్రిల్ 14: వైసీపీ పాలనలో దగా పడ్డ యువతకు టీడీపీ అధినేత చంద్రబాబు భరోసా ఇస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం రామకుప్పంలో తెలుగుయువత సభ్యులకు ఎన్నికలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత జగన్ చెప్పిన ఏటా జాబ్‌కేలండర్, మెగాడీఎస్సీ, పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాల కల్పన వింటి హామీలను నమ్మి యువత ఓట్లేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక జగన్ వాటన్నింటిని విస్మరించి, యువతకు తీరని ద్రోహం చేశారన్నారు. దీనిని గుర్తించిన చంద్రబాబు ఐదేళ్ళలో 20లక్షల ఉద్యోగాల కల్పన, మెగాడీఎస్సీపై తొలిసంతకం వంటి పథకాలను ప్రకటించారన్నారు. అందేకాకుండా క్షేత్రస్థాయిలో యువతకు స్వయం ఉపాధి కోసం వివిధ కార్పోరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు కూడా అందిస్తారన్నారు.

బిడ్డల భవిష్యత్తు కోసం బాబును గెలిపించాలి

శాంతిపురం, ఏప్రిల్14: బిడ్డల భవిష్యత్తు కోసం చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మొరసనపల్లె, పాకంపల్లె, నారసింహేపల్లె, జల్లిగానిపల్లె, కనమలదొడ్డి గ్రామాలలో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబు షూర్యటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను మహిళలకు పంపిణీ చేశారు.

ఎన్నికల్లో యువత పాత్ర కీలకం

శాంతిపురం, ఏప్రిల్ 14 : ఎన్నికల్లో బూత్ వారీగా టీడీపీ మెజారిటీ సాధించేందుకు యువతే కీలక పాత్ర వహించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఈఎస్ఆర్ కళ్యాణ మండపంలో జనసేన, తెలుగు యువతతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. వైసీపీ నేతల అరాచకాలను ప్రశ్నిస్తే దౌర్జన్యాలు, దాడులు, కేసులతో అణిచివేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడి యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, జనసైనికులు, బీజేపీ యువత తదితరులు పాల్గొన్నారు.

కౌండిన్యలో దొంగలు పడ్డారు !


చెక్‌డ్యాం రాళ్లను ట్రాక్టరులో నింపుతున్న కూలీలు

పలమనేరు, ఏప్రిల్14 : పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో దొంగలు పడ్డారు. కౌండిన్య నదిపై నిర్మించిన చెక్‌డ్యాంలు రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొట్టుకు పోయాయి. ఇరిగేషన్‌శాఖ, ప్రభుత్వం చెక్‌డ్యాంల మరమ్మతు గురించి పట్టించుకోలేదు. దీంతో ఇసుకాసురులు ఇప్పటికే కౌండిన్యలోని ఇసుకను పూర్తిగా నాకేశారు. ఇప్పుడు కొందరు తెగిపోయిన చెక్‌డ్యాంల వద్ద పునాది రాళ్లను తరలించుకుపోతున్నారు. ఇకనైనా అధికారులు వీటిని తరలించుకు పోకుండా నిఘా వేయాల్సిన అవసరం వుంది.

వివాదాస్పద ప్రాంతంలో అంబేడ్కర్‌కు నివాళి



రామకుప్పం, ఏప్రిల్ 14: రామకుప్పం శివాజీనగర్, రెడ్డివీధిల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా పూజలు చేయాలన్న స్థానిక శివాజీనగర్ వాసుల కోరిక ఈ సారి కూడా నెరవేరలేదు. నాలుగేళ్ళుగా ఇక్కడ విగ్రహాల ఏర్పాటుపై ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తుండటంతో ప్రతి ఏటా అంబేడ్కర్ జయంతి, వర్ధంతిల సందర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి పోలీసు బందోబస్తు మధ్య అంబేడ్కర్ విగ్రహంతోపాటు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి శిలాఫలకానికి పూజలు చేసి నివాళులర్పించేవారు. ఆదివారం జిల్లా అధికారులు ఆదేశాల మేరకు అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రామకుప్పం ఎస్సీ బాలుర వసతి గృహం సంక్షేమాధికారి బాలమురుగన్ తమ సిబ్బందితో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూజలు చేసి నివాళులర్పించారు. అదేవిధంగా పక్కనే గల ఉయ్యాలవాడ నరసింహారెడ్డి శిలాఫలకానికి పూజలు చేశారు.

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

పలమనేరు : రాజకీయ సభలు, సమావేశాలు, ఊరేగింపులతోపాటు జాతరలకు తప్పనిసరిగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్డీఓ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ఆర్వో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

నవయుగ వైతాళికుడు అంబేడ్కర్

కుప్పంలో టీడీపీ భారీ ఊరేగింపు




కుప్పంలో డప్పు కొడుతూ అంబేడ్కర్ ఊరేగింపులో కంచర్ల తదితరులు, పలమనేరు, శాంతిపురంలలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

కుప్పం, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ నవయుగ వైతాళికుడని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని టీడీపీ ఆధ్వర్యంలో కుప్పంలో అంబేడ్కర్ చిత్రపటంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, కన్నన్, అప్పు ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కుప్పంలోని జనసేన కార్యాలయంలో కూడా అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఎస్పీ నియోజకవర్గ నాయకుడు గణేశ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి : అమర్

పలమనేరు : బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు కృషిచేద్దాం అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా పలమనేరులోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.వి. బాలాజి, నాగరాజు, ఆర్బీసీకుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యంగౌడు, ఖాజాపీర్, కృష్ణమూర్తి, చిన్ని, వెంకటేసు, సుబ్రమణ్యం, జగదీష్‌నాయుడు, సోమశేఖర్‌గౌడు, మురళి తదితరులు పాల్గొన్నారు. పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీపీఎస్ అధ్యక్షుడు సుబ్రమణ్యంపిళ్లై, కార్యదర్శి నరసింహులు, ఎన్జీఓ సంఘ నాయకులు ఆనందబాబు, లక్ష్మీపతియాదవ్, శ్రీపురం సీతారామయ్య పాల్గొన్నారు.

శాంతిపురం : టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాకంపల్లె, రామాపురం గ్రామాలలో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

సోమల : సోమల పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ వెంకటనరసింహులు, సిబ్బంది, పొదలగుంటపల్లె సచివాలయంలో సర్పంచు జయరాం, ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి, సోమలలో సర్పంచు రాజేశ్వరి, ఎంపీటీసీ సావిత్రమ్మ, వీవీ రమణ, సోమల బస్టాండ్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు మురళీ, మొగిలీశ్వర్, ప్రకాశ్, వైస్ఎంపీపీ ప్రభాకర్, ఆటో యూనియన్ నాయకుడు మునిరాజ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

రొంపిచెర్ల: రాయసీమ బీసీ నాయకుడు బంగారు నారాయణస్వామి, మండల బీసీ అధ్యక్షుడు నూరేషా, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఓబులేష్, మైనార్టీ నాయకుడు సైపుల్లా, ఎం.వెంకటేష్, రాజన్న తదితరులు రొంపిచెర్ల బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కల్లూరు : కల్లూరులో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఈఎం రత్నం, టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు నూర్‌బాషా, కరీముల్లా, ముద్దుస్వామినాయుడు, మునికృష్ణ, బారేషావల్లి, క్రాంతి, పూలరమేష్, సతీష్, చిట్టిబాబు, పవన్, సర్దార్‌భాషా, బాబు, యుగంధర్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

గుడుపల్లె : మండలంలోని చీకటిపల్లెలో దళిత సంఘ నాయకుడు విజయ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణ, రామప్ప, మునస్వామి, రీటా ఎల్లప్ప, వాసు, సుబ్బు, బేటరాయుడు, బాబు, లక్ష్మణుడు, శ్రీనివాసులు, గోపాల్, రాము, రామక్రిష్ణ, శీను పాల్గొన్నారు.

రామకుప్పం : టీడీపీ కార్యాలయంలో నాయకులు ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి అధ్వర్యంలో పార్టీ శ్రేణులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల సచివాలయంలో ఎంపీడీఓ ఈశ్వరయ్య, తహసీల్దారు శ్రీధర్, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పుంగనూరు : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు అమలు కావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీ రెడ్డెప్ప కోరారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పుంగమ్మ చెరువు కట్టపై మాలమహానాడు కార్యాలయంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు, ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ట్రాక్టర్లకు అంబేడ్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుమిత్ర రమణ, శ్రీనివాసులు, చిన్నబ్బ, న్యాయవాది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి కార్మికసంఘ నాయకుడు శ్రీరాములు కార్మికులతో కలసి అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దళిత సంఘ నాయకులు

యువతిని బ్లాక్‌మెయిల్ చేసిన యువకుడి అరెస్ట్

గంగవరం, ఏప్రిల్ 14 : యువతిని బ్లాక్‌మెయిల్ చేసి బెదిరింపులకు గురిచేసిన యువకుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. ఆదివారం స్థానిక గంగవరం పోలిస్‌స్టేషన్‌లో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన యువకుడు అజయ్‌రెడ్డిని అరెస్ట్ చూపి వివరాలను సీఐ వెల్లడించారు. గంగవరం మండలానికి చెందిన ఓ యువతి ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతోంది. ఈ యువతికి బెంగళూరులో ఓ ప్రైవేటు జాబ్ చేస్తున్న బైరెడ్డిపల్లె మండలం కు చెందిన అజయ్‌కుమార్ అలియాస్ అజయ్‌రెడ్డి తన స్నేహితుడి ద్వారా సదరు విద్యార్థినీని ఆరునెలల క్రితం పరిచయం చేసుకున్నాడు. సదరు విద్యార్థితో చాటింగ్‌లు చేస్తూ, ఆ చాటింగ్‌లను అందరికీ చూపిస్తానని బెదిరించి నీవు ముళబాగిల్‌కు వస్తే వదిలేస్తానని ఏమార్చాడు. దీంతో సదరు విద్యార్థిని ములబాగిల్‌కు పిలిపించుకొని , సదరు విద్యార్థినితో కొన్నివీడియోలు తీసుకొని, నీవు వెళ్లిపో వీడియోలు డెలిట్ చేస్తానని నమ్మించి పంపించేశాడు. ఈ క్రమంలో సదరు బీటెక్ విద్యార్థినికి ఒక నెల క్రితం వివాహం కుదిరి ఎంగేజ్‌మెంట్ అయింది. ఈ విషయం తెలుసుకున్న అజయ్‌కుమార్ తను తీసుకున్న వీడియోలను వాట్సప్ ద్వారా, విద్యార్థినితోపాటు వారి బంధువులకు పోస్ట్ చేసి మళ్లీ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. ఆ వీడియోలను చేసిన విద్యార్థిని శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా, వారి కుటుంబసభ్యులు అడ్డుకొని జరిగిన విషయం పై ఆరాతీశారు. ఇలాంటి వ్యక్తిని వదలకూడదని గంగవరం పోలిస్‌స్టేషన్‌లో వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన అజయ్‌కుమార్‌ను ఆదివారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసిన గంగవరం అర్బన్ సీఐ తో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ప్రకటించారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



పుంగనూరు రూరల్, ఏప్రిల్14: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం రాత్రి పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. మదనపల్లె పట్టణం ఆర్ఆర్‌కాలనీకి చెందిన శ్రీనివాసులు సుగాలిమిట్టకు వచ్చి తిరుగు ప్రయాణంలో మదనపల్లె రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన శ్రీనివాసులును పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. డాక్టర్ల సూచనల మేరకు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 14: ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆదివారం అర్బన్ సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు ... పుంగనూరు మండలానికి చెందిన ఓ బాలిక పుంగనూరులో చదువుతోంది. ఈ నేపథ్యంలో గత నెల 17న ఆ విద్యార్థిని అదృశ్యం అయినట్లు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. అయితే పుంగనూరుకు చెందిన మహేంద్రతో కలసి ఉన్నట్లు సమాచారం రావడంతో అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

దండపల్లె జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహం దర్శనం

ఎన్నికల్ కోడ్ అమలులో అధికారుల అలసత్వం



గంగవరం, ఏప్రిల్ 14 : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నెలరోజులు కావస్తున్నా కోడ్‌ను అమలు చేయాల్సిన అధికారులు మాత్రం తూతూమంత్రంగానే వ్యవహిస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ ఆరోపణలకు గంగవరం మండలంలోని దండపల్లె జంక్షన్ వద్ద దర్శనమిస్తున్న సుమారు వంద అడుగుల వైఎస్సార్ విగ్రహమే ఇందుకు నిదర్శనం. ఈ ప్రాంతంలో వెళ్లే వారందరూ ఈ విగ్రహాన్ని చేసి, ఈ విగ్రహానికి ఎన్నికలకోడ్ వర్తించదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోడ్‌ను సక్రమంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా అగ్ని మారెమ్మ ఊరేగింపు

గుడుపల్లె, ఏప్రిల్14: గుండ్లసాగరంలో కొలువైన అగ్ని మారెమ్మ ఆదివారం పుష్ప పల్లకిలో ఊరేగి భక్తులకు కనువిందు చేసారు. ఉదయం అమ్మవారిని రంగురంగు పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి పుష్ప పల్లకిలో అధిష్ఠింపజేశారు. అనంతరం మంగళవాయి ద్యాలు, కోలాటాలు, నయ్యాండి, గెరిగతో ఉత్సవాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి హారతులు ఇచ్చి మొక్కుకున్నారు. ఆ తరువాత అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ కమిటీవారు భక్తులకు అన్నదానం నిర్వహించారు.




ప్రజల హక్కులను కాపాడాలి : బీసీవైపీ



భారీ కేక్ కట్ చేసి పంచుతున్న నాయకులు, పుంగనూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీసీవైపార్టీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్ 14: పుంగనూరులో ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రజల హక్కులు కాపాడాలని బీసీవై పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.హరినాథరెడ్డి, సాంబమూర్తి పేర్కొన్నారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన జయంతి సందర్భంగా కేక్ కట్‌చేసి ప్రజలకు కేక్, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఐదేళ్లు పుంగనూరులో నరకం అనుభవించారని, ఎక్కడా చూసినా దౌర్జన్యాలు, దాడులు, దోపిడీ, అరాచకాలతో వైసీపీ పాలన సాగిందని వివరించారు. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితికూడా లేకుండా వైసీపీ నాయకులు వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, కొందరు పోలీసు అధికారుల ద్వారా ప్రతిపక్షాలపై అక్రమంగా వందల కేసులు పెట్టి అరెస్టులు చేయడం, రౌడీషీట్లు పెట్టడం లాంటి అరాచకాలు జరిగాయని గుర్తుచేశారు. పాడిరైతులకు మంత్రి పెద్దిరెడ్డి, పాల డెయిరీ అన్యాయం చేస్తోందన్నారు. రైతులకు జరుగుతున్న దోపిడీని అరికట్టి వారికి న్యాయం జరిగేలా గిట్టుబాటు ధర కల్పించాలని రైతుభేరీ సభ పెట్టాలంటే పోలీసులు అడ్డుకోవడం, వైసీపీ శ్రేణులు తమ నేత రామచంద్రయాదవ్ ఇంటిపై దాడి చేసి వాహనాలను ధ్వంసం చేశారని, రెండురోజుల క్రితం సదుంలో ప్రచారరథాలను ధ్వంసం చేసి బీసీవైపీ నాయకులపై దాడులు చేశారని గుర్తు చేశారు. పుంగనూరులో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా కేంద్ర సాయుధ బలగాలు రప్పించడానికి బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి వినతి చేశారన్నారు. పుంగనూరులో ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రశాంతత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీవైపీ నాయకులు ఆనంద్, పాల రమేశ్, కిరణ్, నారాయణస్వామి, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో టీడీపీదే విజయం : చల్లా



చౌడేపల్లెలో ప్రజలకు అభివాదం చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి, బైక్‌ర్యాలీలో పాల్గొన్న టీడీపీశ్రేణులు

చౌడేపల్లె, ఏప్రిల్14: పుంగనూరు నియోజకవర్గంలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయం సాధించడం, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చౌడేపల్లెలో తలపెట్టిన బైక్‌ర్యాలీకి భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలిరావడంతో పసుపు జెండాలతో పండుగ వాతావరణం నెలకొని అందరిలో ఉత్సాహం వెల్లివిరిసింది. తొలత టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డి క్రేన్ ద్వారా గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం స్థానిక బస్టాండ్ నుంచి వందలాది మోటారు సైకిళ్లతో పురవీధుల్లో బైకు ర్యాలీ జరిగింది. అలాగే మండలంలోని సింగిరిగుంట, పరిగిడొన, తెల్లనీళ్లపల్లె, నాగిరెడ్డిపల్లె, కోటూరు, పెద్దకొండామర్రి, లద్దిగం, ఠాణాకొత్తయిండ్లు, పంజాణిపల్లె మీదుగా ర్యాలీ నిర్వహించారు. పంజాణిపల్లెలో వైసీపీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేయడం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణరాజు, లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజు, జంపాల శ్రీనివాసులనాయుడు, బోయకొండ సుబ్బు, హరిప్రసాద్‌రెడ్డి, భోజనాలరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, బాబునాయుడు, ఓబుల్‌రెడ్డి, కళ్యాణ్ ప్రభాకర్, కుమార్‌రెడ్డి, చంద్రమౌళి, శివన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

దగ్గరలోనే పుంగనూరుకు మంచిరోజులు

పుంగనూరు : పుంగనూరు ప్రజలు ప్రశాంతంగా ఉండేలా మంచిరోజులు దగ్గరలోనే ఉన్నాయని చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన వైసీపీ నాయకులు నారాయణరెడ్డి, జయనాథరెడ్డి, ఎస్.బాషాలు తన అనుచరులతో చౌడేపల్లెలో చల్లా బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన అనుచరులు చేస్తున్న దౌర్జన్యాలు, అరాచకాలకు ప్రజలు భయపడుతున్నారన్నారు. ప్రజలు ప్రశాంత జీవితం సాగించాలని ఆశతో ఉన్న వారిపై దోపిడీలు, ఆరాచకాలు, దౌర్జన్యాలు చేయడం సరికాదని దుయ్యబట్టారు. వైసీపీని ప్రజలు ఎన్నికల్లో ఇంటికి పంపడమే కాకుండా పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం పరాజయం పాలు ఖావడం తథ్యమన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం విజయం సాధించి సీఎంగా చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతారని తెలిపారు. అలాగే పుంగనూరు మండలం పాళ్యంపల్లె, సుగాలిమిట్ట పంచాయతీల్లో మండల టీడీపీ నాయకులు పర్యటించి టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణరాజు, మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీస్ గిరి, శమిపతి, కృష్ణానాయక్, గంగాధర్, ప్రసాద్, నరసింహులు, దామోదరం, వెంకటస్వామి, జనసేన నాయకులు విరూపాక్షి, బాలాజీనాయక్, హరినాయక్, చైతన్యరాయల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పుంగనూరు పట్టణంలోని ఎన్ఎస్‌పేటలో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శ్రీకాంత్, సుబ్రహ్మణ్యం రాజు, దేశాధిప్రకాశ్, డికె శ్రీనివాసులు, శ్రీనివాసులు, రామయ్య, కిరణ్, రాజు, ప్రసాద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 30 కుటుంబాలు

కుప్పం రూరల్, ఏప్రిల్ 14: కుప్పం మండలం ఎన్.కొత్తపల్లెలో వైసీపీకి చెందిన 30 కుటుంబాలు శనివారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే గరిగచీనేపల్లెకు చెందిన యువత కూడా భారీగా టీడీపీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

పుంగనూరు రూరల్, ఏప్రిల్14: మామిడితోట, గడ్డివామి, డ్రిప్ పైపులకు నిప్పు పెట్టడంతో దాదాపు రూ.50వేలు నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. ఆదివారం పుంగనూరు మండలం లక్ష్మీనాయక్‌తాండా సమీపంలో నారాయణ నాయక్, రామయ్య మామిడితోటలు, గడ్డివామి, డ్రిప్ పైపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గుర్తించిన రైతులు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు ఆయన చెప్పారు.

యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు : అమర్


అమరనాథ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వారు

గంగవరం,ఏప్రిల్14 :మన రాష్ట్రం బాగుపడి యువత భవిష్యత్తు బాగుండాలంటే జగన్‌ను సాగనంపాల్సిన బాధ్యత యువతదే అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గంగవరం మండలం గండ్రా జుపల్లె సమీపంలో జరిగిన మండల తెలుగు యువత ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర భవిష్యత్తుకు పునాదులువేసి ఆర్థిక వనరులను పెంపొందించడానికి పరిశ్రమలు తీసుకొస్తే, ఈ ఐదేళ్లలో వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పలమనేరు నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశలు మెరుగుపడేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, తెలుగు యువత గిరిధర్‌గోపాల్, మదన్‌మోహన్, మురళి, మంజునాథ్, రాకేష్, జనసేన దిలీప్, హరీష్, చందు పవన్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు : ఆదివారం పలమనేరు మండల తెలుగుయువత ఆత్మీయ సమావేశంలో అమరనాథరెడ్డి పాల్గొని ప్రసంగించారు. సొంత చెల్లెళ్లకు న్యాయం చేయలేని జగన్ మనకు ఏమిచేస్తాడో అందరూ ఆలోచించాలన్నారు. యువత ఇప్పటికైనా మేల్కొని మంచి విజన్, అనుభవం ఉన్న చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకొనేందుకు గాను అందరూ టీడీపీకి ఓటు వేయాలన్నారు. సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజరెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు వెంకటమునిరెడ్డి, నాయకులు వాసు, మోహన్ వెంకటేసు, రెడ్డెప్ప, పృథ్వి, శ్రీనివాసులురెడ్డితోపాటు జనసేన నాయకులు దిలీప్, నాగరాజు, భరత్ మాధవ్, బీజేపీ నాయకులు మొగిలీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరిక

పలమనేరు టీడీపీ కార్యాలయంలో అమరనాథరెడ్డి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. మండలంలోని కోతిగుట్ట, టి.ఒడ్డూరు, గొబ్బిళ్లకోటూరు, గడ్డూరు గ్రామాలకు చెందిన సుమారు 25మంది భాస్కర్‌యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పెద్దపంజాణి మండలం మద్దెలకుంట గ్రామానికి చెందిన 20మంది ఆనంద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పలమనేరు 14వ వార్డుకు చెందిన నాగరాజు ఆధ్వర్యంలో 25మంది టీడీపీలో చేరారు. పలమనేరు ఎస్టీ కాలనీకి చెందిన మునెప్ప, శరవణల ఆధ్వర్యంలో 20 మంది టీడీపీలో చేరారు. గంగవరం మండలం గండ్రాజుపల్లిలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పలువురు యువత టీడీపీలో చేరారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



చిత్తూరులో ఆదివారం మాజీ మేయర్ కటారి హేమలత నివాసానికి వెళ్లి కలసిన మాజీ ఎమ్మెల్యే, కాపు సంఘం రాష్ట్ర నేత వంగవీటి రాధా, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల తదితరులు

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



సీకే బాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం నగరంలోని 29వ డివిజన్ పరిధిలోని మిట్టూరుకు చెందిన ఏసీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి నేతలు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 14వ డివిజన్‌లోని తిమ్మసానిపల్లెకు చెందిన వైసీపీ సీనియర్ నేత జయగోపాల్ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నేతలు వసంత్‌కుమార్, పూర్ణచంద్రరావు, గురజాల సురేష్, శ్రీనివాసులు, పురుషోత్తం, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఆటోడ్రైవర్లు



ఆటోడ్రైవర్లను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎన్‌పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 14: టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలకు ఆకర్షితులై మండలంలోని 30 మంది ఆటోడ్రైవర్లు ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో తెలుగుదేవం పార్టీలో చేరారు. చేరిన వారిలో ఫయాజ్, అయాజ్, అయ్యప్ప శెట్టి, సుధాకర్, అజీమ్ తదితరులు ఉన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు ప్రభుత్వ కళాశాల వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీ జయచంద్ర నాయుడు, ఎన్‌పీ విక్రమ్, కమల్‌నాథ రెడ్డి, జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు పాల్గొన్నారు.

దగ్గుమళ్ల, రాజన్‌లను కలిసిన వైసీపీ నేతలు

● త్వరలో కార్యకర్తలతో పాటు టీడీపీలో చేరనున్న బాబు నాయుడు, సుధాకర్ నాయుడు



దగ్గుమళ్లను కలిసిన బాబునాయుడు, సుధాకర్‌నాయుడు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 14: చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్‌లను ఆదివారం సాయంత్రం గంగాధరనెల్లూరు మండలం కొత్తవెంకటాపురం గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీనేత, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ బొడపాటి బాబు నాయుడు (నరసింహులు నాయుడు), వైసీపీనేత సుధాకర్ నాయుడులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా కొత్తవెంకటాపురం, పాతవెంకటాపురం పంచాయతీల్లోని వైసీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి బాబు నాయుడు, సుధాకర్ నాయుడులు త్వరలో టీడీపీలో చేరనున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సురేంద్రకుమార్, జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, పాతపాళ్యం మాజీ సర్పంచ్ వెంకటేష్ నాయుడు, రవీంద్ర నాయుడు, జగదీశ్వర నాయుడు పాల్గొన్నారు.

కోదండ రామాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామి అమ్మవార్లకు విష్వక్సేన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 14: నగరంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన కోదండ రామాలయంలో ఆదివారం స్వామివారి బ్రహ్మోత్సవాలు విష్వక్సేన తిరుమంజనం, ఉత్సవాలతో ప్రారంభం అయ్యాయి. రాష్ట్ర దేవదాయశాఖ తరపున ఈవో సుబ్రమణ్యం నాయుడు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు వాయనం మేళతాళలతో ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కె. సుగుణ, నటకల బద్రీనాథ్‌ల ఉభయంతో అర్చక బృందం కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు పాల్గొన్నారు.

ధన్వంతరి అలంకారంలో శ్రీమహావిష్ణువు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 14: గిరింపేట వీరాంజనేయస్వామి ఆలయంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. స్వామి వారు ధన్వంతరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఉత్సవ నిర్వాహకులు కె.యస్. కుమార్, రెడ్డిగుంట కిషోర్, అర్చకులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గిరింపేట పగడమానువీధి శ్రీరామ భజనమందిరంలో తమిళ సంవత్సరాది సందర్భంగా సీతారాముల కల్యాణం జరిగింది.

శాస్త్రోక్తంగా దేవర ఎద్దుకు అంత్యక్రియలు



వెదురుకుప్పం, ఏప్రిల్ 14: కామసాని కులస్తుల దేవర ఎద్దుకు ఆదివారం అంత్యక్రియలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె పంచాయతీ కొండారెడ్డివూరు వద్ద గ్రామ పెద్దలు నిర్దేశించిన ప్రాంతంలో దేవర ఎద్దుకు అంతిమ సంస్కారం చేశారు. శనివారం రాత్రి దేవర ఎద్దు మృతి చెందిన విషయం తెలిసిందే. దేవర ఎద్దుకు జనసందోహంతో కన్నీటి వీడ్కోలు పలికారు.

అగ్నిమాపక వారోత్సవ కరపత్రాల విడుదల

నగరి, ఏప్రిల్ 14: ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను నగరి ప్రభుత్వాస్పత్రి డాక్టర్ కార్తీక్ ఆదివారం విడుదల చేశారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా ఆయన మాట్లాడుతూ వేసవి మండుటెండలలో జరిగే ప్రమాదాలను నివారించడానికి, ప్రజలను అప్రమత్తం చేయడానికి అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్నిమాపక స్టేషన్ ఎస్ఐ సుబ్బరాజు మాట్లాడుతూ వారం రోజులపాటు అగ్ని ప్రమాదాలు వేసవిలో ఎలా జరుగుతాయి, వాటి నివారణ చర్యలు ఎలా చేపట్టాలి అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

కారు అదుపు తప్పి బోల్తా: ఒకరికి గాయాలు



బోల్తాపడిన కారు, గాయపడిన శ్రీనివాసులురెడ్డి

వెదురుకుప్పం, ఏప్రిల్ 14: కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో రిటైర్డ్ స్టేట్ బ్యాంకు ఉద్యోగికి గాయాలైనట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. తిరుపతిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ స్టేట్ బ్యాంకు ఉద్యోగి బండి శ్రీనివాసులు రెడ్డి(62) తన కారులో తిరుపతి నుంచి స్వగ్రామమైన వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ మాకమాంబాపురంకు వస్తుండగా ఎర్రగుంటపల్లి సమీపంలో అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసులురెడ్డి గాయపడ్డారని తెలిపారు. ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో తమిళ ఉగాది పండుగ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్14: నగరంలోని తమిళ కుటుంబాలు ఆదివారం తమిళ సంవత్సరాది పండుగను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి ఆలయంలో, గిరింపేట దుర్గాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నగరంలో ఎక్కడ చూసినా తమిళ యువత ఉత్సాహంగా గడిపారు.



అంకాల పరమేశ్వరి ఆలయంలోభక్తుల సందడి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



జిల్లా టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నేతల నివాళి, చిత్తూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు, నగరిలో కేక్ కట్‌చేస్తున్న భానుప్రకాష్

● టీడీపీ కార్యాలయంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: జిల్లా వ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, నగర, మండల, గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు దళిత సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు, అధికారులు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జిల్లా టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, నేతలు కోదండయాదవ్, సప్తగిరి ప్రసాద్, ఎన్‌పీ జయప్రకాష్, సుబ్రి, శ్రీధర్ యాదవ్, మోహన్‌రాజ్, దశరథ వాసు, అశోకన్, పీటర్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు (సెంట్రల్): డీఈవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఈవో దేవరాజు, కార్యాలయ సిబ్బంది మురళి, నాగరాజు, స్వర్ణ, గోపాల్, రవికుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు: ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పన్నీర్ శెల్వం, సలహాదారుడు రామన్న, గౌరవాధ్యక్షులు షణ్ముగం, నేతలు రోషన్ బాష, సురేష్‌బాబు, బాలాజీ, హరి తదితరులు నివాళులు అర్పించారు.

చిత్తూరు రూరల్: ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో సుమారు 100 మంది రోగులకు పండ్లు, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంఘ నాయకులు అరుల్‌మణి, పరంజ్యోతి, సులోచన తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పెద్ద దళితవాడలో పీహెచ్ వాడ యూత్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు హరికృష్ణమూర్తి, రాజేంద్రన్, నాగరాజు, కృష్ణమూర్తి, మారన్, జ్యోతిబాబు, జలంధర్, మేఘనాథం, శ్రీనివాసులు తదితరులు నివాళులర్పించారు.

ఐరాల: నాగమవాండ్లపల్లె పంచాయతీ వి.ఎస్.అగ్రహారంలో పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి అందరికి పంచారు.

నగరి: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్, నాయకులు, వైసీపీ నేతలు, మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కౌన్సిలర్ బీడీభాస్కర్ తదితరులు నగరి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు గోవిందస్వామి, గాంధీ, యాకూబ్, మైలుస్వామి, గోపి, టీడీపీ తరపున బాలాజీ, రమేష్‌బాబు, మీరాయకన్నెప్ప, దేవా పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎట్టేరి దళితవాడ వద్ద టీడీపీ నేతలు, వి.ఎస్.అగ్రహారంలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ అభ్యర్థి మురళీమోహన్

పూతలపట్టు: రంగంపేట క్రాస్ రోడ్డు వద్ద,పూతలపట్టు మండల కేంద్రంలో టీడీపీ దళిత నాయకులు నివాళులర్పించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమానికి పాలకూరు గ్రామానికి చెందిన యువకులు ప్రమోద్, గిరీష్, హేమంత్, అఖిల్, వంశీ, ఏకాంబరం తదితరులు భోజనం వితరణ చేశారు.

గంగాధరనెల్లూరు: ఎట్టేరి దళితవాడలో కొత్తగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కోదండరెడ్డి, మాజీ సర్పంచ్ క్రిష్ణయ్య, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ హరీష్, నేతలు వరదరాజులు, వెంకటేష్‌యాదవ్, దాము, దళిత నేతలు వేర్వేరుగా పూలమాలలువేసి నివాళులు అర్పించారు. గంగాధరనెల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి అధికారులు, రాజకీయపార్టీల నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

హక్కుల సాధన కోసం వైసీపీ ప్రభుత్వం మారాలి

● విశ్రాంత ఉద్యోగులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గురజాల, దగ్గుమళ్ల తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: హక్కుల సాధనకోసం వైసీపీ ప్రభుత్వం మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు రాజశేఖర్, పూర్ణచంద్రరావు, శివకుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను, చిత్తూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ ఎప్పుడు వస్తుందో తెలియదని, దానికోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ సమస్యలు తీరాలంటే టీడీపీ కూటమిని బలపరచాలన్నారు. చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల జగన్మోహన్‌ను, చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించుకునేందుకు తాము కృషిచేస్తామని తీర్మానించారు. చంద్రబాబు గెలుపు.. పెన్షనర్ల పిలుపు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు గురవయ్య నాయుడు, మురళి, వీర రాఘవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సీకేబాబు

యాదమరి, ఏప్రిల్ 14: వైసీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని కొటాల గ్రామంలో నిర్వహించిన జయహో బీసీ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే సీకే బాబు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి మురళీమోహన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుమారుడు దగ్గుమళ్ల సుధాకర్‌రావు, మాజీ కార్పొరేటర్ వసంత్‌కుమార్, మండల శాఖ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబి, నేతలు హేమగిరి, యువరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తా

ఐరాల, ఏప్రిల్ 14: పూతలపట్టు నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి ఐరువారంపల్లె, భీమినేనివారిపల్లె, నాంపల్లె పంచాయతీలలో పర్యటించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు సోమశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.ఎన్నికల ప్రచారంలో చిన్నారులు పసుపు టీషర్టు వేసుకుని టీడీపీ జెండాను పట్టుకుని విచ్చేశారు. వారి ఉత్సాహాన్ని చూసిన నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

వడ్డెర సాధికార సమితి పోస్టర్ ఆవిష్కరణ

యాదమరి, ఏప్రిల్ 14: చిత్తూరు పార్లమెంటు టీడీపీ వడ్డెర సంఘం సాధికార సమితి పోస్టర్లను ఆదివారం కొటాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, పూతలపట్టు నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు ధరణీ ప్రకాష్, మండల శాఖ అధ్యక్షులు మురార్జీ తదితరులు ఆవిష్కరించారు. మణికంఠ, మురళీ, దామోదరం పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్



బొమ్మసముద్రంలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రతిమ

గుడిపాల, ఏప్రిల్ 14: టీడీపీ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.6 వేలు, వయోవృద్ధులకు రూ.4 వేలు చొప్పున పింఛన్ పంపిణీ చేయనున్నట్లు చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి అన్నారు. ఆదివారం మండలంలోని బొమ్మసముద్రం, గట్రాళ్ళమిట్ట, నంగమంగళం న్యాకలనీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాక్షస పాలనలో నిరుపేదలకు అన్యాయం జరిగిందని, వైసీపీ ప్రభుత్వానికి ఓటు ద్వారా చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు ధనసింగ్, దొరబాబు, వాసుదేవరెడ్డి, ఉదయ, శిల్ప, సుమతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండేళ్లు అవుతోంది... జీతాలు ఇప్పించండి

● కలెక్టర్‌కు బాధితుడు శివకుమార్ విన్నపం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 14: జిల్లా పరిషత్ కార్యాలయంలో పీఎంఏజీవైలో యంగ్ ప్రొఫెషనల్‌గా పనిచేసిన తనకు 4 నెలల జీతం, 18 నెలల ట్రావెలింగ్ అలవెన్సులు ఇప్పించాలని కలెక్టర్‌కు బాధితుడు శివకుమార్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా విన్నవించారు. 2020 నుంచి 2022 వరకు విధులు నిర్వహించానని, అప్పుడు కూడా ఆరు నెలలకు, సంవత్సరానికి జీతాలు ఇచ్చేవారిని పేర్కొన్నారు. అప్పటి జడ్పీ సీఈవో ప్రభాకరరెడ్డి, ప్రస్తుతమున్న డీపీఆర్సీ కో-ఆర్డినేటర్ షణ్ముఖరామ్ తనకు సక్రమంగా జీతం ఇవ్వకుండా వేధించేవారని ఆరోపించారు. తనకు రావాల్సిన జీతం, అలవెన్సుల గురించి అడిగితే కేసులు పెడతానని బెదిరించేవారని పేర్కొన్నారు. అప్పులు చేసి ట్రావెలింగ్ చేశానని, తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరారు. తనకు రావాల్సిన అలవెన్సుల గురించి ప్రస్తుతమున్న సీఈవోకు ఫిర్యాదు చేశానని, తనకు సంబంధించిన రికార్డులను డీపీఆర్సీ కో-ఆర్డినేటర్ షణ్ముఖరామ్ మాయం చేశారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని, తనను మానసికంగా ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కాలిపోతున్న అడవులు - పట్టించుకోని అటవీశాఖ అధికారులు

పాలసముద్రం, ఏప్రిల్ 14: మండలంలోని అడవులు గత వారం పది రోజులుగా కాలిపోయాయి. కొంతమంది సంఘ విద్రోహులు ప్రతి సంవత్సరం వేసవి కాలం ప్రారంభంలోనే అడవులకు నిప్పు పెడుతున్నారు. కాలిపోతే అడవిలోని చెట్లను నరికి ఇటుక బట్టీలకు తరలించడానికి అనువుగా ఉంటుందనే ఉద్దేశంతోనే కొంతమంది ఉద్దేశపూర్వకంగానే మండలంలో వున్న అడవులకు నిప్పు పెడుతున్నారు. అడవులు కాలిపోవడం వల్ల సమీప గ్రామాలకు గాలులు వీచినప్పుడు బూడిద పంట పొలాలు, ఇళ్ల మీదికి వస్తోంది. దీని వల్ల వ్యవసాయ బావుల్లోని నీరు సైతం కలుషితమవుతోంది. మరోవైపు అడవులు కాలిపోవడం వల్ల జంతువులు రాత్రిపూట అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండే పంట పొలాలపై పడి పంటలను సైతం నాశనం చేస్తున్నాయి. అటవీశాఖ అధికారులు తగుచర్యలు తీసుకుని అడవులు కాలిపోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శ్రీకావేరిరాజుపురంలో కాలిపోయిన అడవులు

ఓటు వేద్దాం.. ప్రగతిని చాటుదాం

చిత్తూరు, ఏప్రిల్ 14: ఓటు వేద్దాం... ప్రగతిని చాటుదాం అంటూ కళాజాత బృందం నగరంలో ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్ టీము ఆధ్వర్యంలో ఎథికల్ ఓటింగ్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మాపాక్షి, అనుప్పల్లె పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో కళాజాత బృందాలతో ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. జానపద పాటలు, బుర్రకథల ద్వారా ఓటు హక్కు ఆవశ్యకత, ఎథికల్ ఓటింగ్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులకు పాదరక్షల వితరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 14: నగరంలోని డేనియల్ లెప్రసీ ఆశ్రమంలో ఆదివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిగ్రస్థులకు పాదరక్షలు వితరణ చేశారు. అనంతరం ఆశ్రమంలోని రోగులకు అన్నదానం చేసి, స్వామి వారి ప్రసాదాలను పంపిణీ చేశారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు మధుసూదనం, నగర కన్వీనర్ శేషనారాయణ, గజేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి కోడికత్తి డ్రామాలు పనిచేయవు

నగరి, ఏప్రిల్ 14: జగన్‌రెడ్డి కోడికత్తి డ్రామాలు ఇకసాగవని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి మండల పరిధిలోని అయనంబాకం, దామరపాకంలో భానుప్రకాష్ ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. వైసీపీని ఇంటికి తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నగరి మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు, నాయకులు బాలాజీ, మీరా, సురేష్ నాయుడు, రుక్కుం బాలాజీ, నారాయణస్వామి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

నిండ్ర: చవరం బాకంలో టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, లోకనాధం నాయుడు, రామూర్తి నాయుడు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



నగరిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న దృశ్యం



జంబాడలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

నగరి, ఏప్రిల్ 14: నగరి పట్టణం, మండలాల నుంచి ఆదివారం పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో మదన్‌కుమార్, వెంకటేష్, రాఘవ, లక్ష్మీపతి, రమేష్, కుమార్, కుమారస్వామి, పరశురామ్, బాలాజీ, గోపి, ముని, షణ్ముగం, ధర్మలింగం, సతీష్, శరవణ, సురేష్, పళని అర్జున్, సత్తివేలు, రామరాజ్, వెంకటేష్ సుందర నాయుడు, యువరాజ్, బాబులతో బాటు 1000 మందికి పైగా వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

విజయపురం: మండలంలోని జంబాడలో ఆదివారం నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో గాలి భానుప్రకాష్ సమక్షంలో మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి మునికృష్ణా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జంబాడ రవిరాజు ఆధ్వర్యంలో, ఇళ్ళత్తూరులో మునిభాస్కర్‌రాజు ఆధ్వర్యంలో, పాతార్కాడులో రమేష్‌రాజు ఆధ్వర్యంలో పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, సుబ్బయ్యదాస్, రామచంద్రరాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, సుధాకర్‌రాజు, ధనుంజయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిండ్ర: మండలంలోని ఇరుగువాయిలో వైసీపీ నుంచి 50 కుటుంబాలు భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ కండవా కప్పుకున్నారు. వైసీపీనుంచి జేమ్స్, రాజేష్, వెంకటేష్, శరవణ, బుజ్జి, వేణు తమ అనుచరులు సుమారు 150 మందితో టీడీపీలోకి చేరారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణం



భక్తులకు మాంగల్యాలను చూపుతున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 14: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి, సమేతనారాయణుడికి ఆదివారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చిత్తూరు అడిషనల్ డీఎంహెచ్‌వో దంపతులు డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ జానకిరావు ఉభయదారులుగా వ్యవహరించారు. వేపంజేరి గోశాలకు చిత్తూరు నగరం దొడ్డిపల్లెకు చెందిన కేశవులు, మీన దంపతులు రూ.2 వేలు విరాళం అందజేశారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జాతర్లకు అనుమతులు తప్పనిసరి

చిత్తూరు, ఏప్రిల్ 14: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున నగరంలో నిర్వహించే ఉత్సవాలు, జాతరలు, ఊరేగింపు కార్యక్రమాలకు జిల్లా ఎన్నికల అధికారి నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఏఆర్వో అరుణ ఒక ప్రకటనలో తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

పూతలపట్టు, ఏప్రిల్ 14: ఇంటి ముందర ఆపివున్న ద్విచక్ర వాహనాలను గుట్టుచప్పుడుగా ఎత్తుకెళ్లిన నలుగురు దొంగలను పూతలపట్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం సింగారెడ్డియూర్ గ్రామానికి వి. సంతోష్‌కుమార్, రంగన్నాథపురం కరసమంగళం గ్రామానికి చెందిన శక్తివేల్, వేలూరు జిల్లా ఎల్‌జి పుదూర్ గ్రామానికి బాలాజి, పళ్ళికుప్పంకు చెందిన దినేష్‌లు ద్విచక్ర వాహనాలను అపహరించి తీసుకెళ్ళేవారు. శనివారం సాయంత్రం పూతలపట్టు సీఐ సుదర్శన ప్రసాద్ రంగంపేట క్రాస్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా వీరి వాహనాలను తనిఖీచేశారు. వీరిపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా... వారు నడుపుతున్న వాహనాలు చోరీచేసినవిగా అంగీకరించారు. దీంతో ఆదివారం వారిపై కేసు నమోదు చేసి మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు